ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

10-10-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 251 పేజీలు: 16 వెల: 6.50




భారత్ పైలట్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం 2

సహా పైలట్ దాడిలో 174 మంది ప్రాణాలను కాపాడిన మచ్చర్

## స్థానిక ఎన్నికలకు సుప్రీం
# గ్రీన్‌సిగ్నల్



- వైసిపి పిటిషన్ కొట్టివేత
- ఓటర్ల జాబితాపై స్పష్టీకరణ
- ఏ జాబితాతోనైనా ఓకే
- వార్డుల విభజన కోరడం
- ఆలస్యం చేసే ప్రయత్నమే
- సీజె ధర్మాసనం వ్యాఖ్యలు
- గడువులోగా నిర్వహించండి
- ఎస్ఇసికి ధర్మాసనం ఆదేశాలు

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. సుప్రీంకోర్టులో వైఎస్సార్సీపీకి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "సర్" ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైఎస్సార్సీపి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఆ పార్టీ లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసిపి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసిపి వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం. వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది. హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం >>2

## బిసిలకు 34% రిజర్వేషన్లు
# హైకోర్టు తీర్పుకు 'సుప్రీం' సమర్థన
## ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ఏపి ప్రభుత్వం జారీ చేసిన రెండు జిఒలను హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక అమలు చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఎక్కడ ఉందని జస్టిస్ దీపాంకర్‌దత్త ధర్మాసనం ప్రశ్నించింది. నివేదిక ఆధారంగా ఫ్యామిలీ డేటాను పరిగణనలోకి తీసుకుంటా >>2

**నేడు కేబినెట్ భేటీ** 2



## గెజిట్ ఇస్తేనే నోటిఫికేషన్
### ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే, ఆ తర్వాత ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో ఆయన చిట్ చాట్‌లో మాట్లాడుతూ, రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం >>2

## రైతులు అర్జీలు కాదు..
# హాలాన్ని పట్టుకోవాలి



నర్సింగోలులో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి-మీ వాక్కు'సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## రాజముద్రతో భూమికి భరోసా కల్పించాం

- ఇప్పటికి 40.58 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ
- 16.48 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు
- కొండపిలో 2,915 ఎకరాల గర్భకండ్రిక భూ సమస్యల పరిష్కారం
- 'మీ భూమి- మీ వాక్కు బహిరంగ సభలో సిఎం చంద్రబాబు
- నర్సింగోలులో రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన

**జరుగుమల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** రైతులు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలే తప్ప భూమి సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూమి రైతుదేనని, దానిపై హక్కు కూడా రైతుదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు తావు లేకుండా, పూర్తి పారదర్శకతతో హక్కులను పరిరక్షించేందుకు రీసర్వే ప్రక్రియను చేపట్టామని తెలిపారు. రీసర్వే 2.0అనంతరం రాజముద్రతో కూడిన పటిష్టమైన భద్రతా ఫీచర్లతో కూడిన పట్టా దారుపాస్ పుస్తకాలను >>2

### బిసిలకు పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు

బిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్ణ యానికి సంబంధించి స్పందించిన ముఖ్యమంత్రి, పార్టీ పరంగా వెను కబడిన వర్గాలకు అండగా నిలుస్తామని చంద్రబాబు ప్రకటించారు. టిడిపికి బిసిలు వెన్నెముక అని, వారి సామా జిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి పార్టీ ఎప్పుడూ కృషి చేసిందని చెప్పా రు. గతంలో తాము తీసుకొచ్చిన 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టించిందని వాటిని >>2

## నీటి చౌర్యం చేస్తే
# అరెస్టు చేయండి



మంచినీటిని చేపలు, రొయ్యల చెరువులకు తరలించినా కఠిన చర్యలు

**ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి**

కలెక్టర్లకు ప్రభుత్వ సిఎస్ జి.సాయిప్రసాద్ ఆదేశం

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, పట్టణ గ్రామీణ మంచి నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఏపి సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ అంశాలపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. మంచి నీటిని మంచినీటేతర అవసరాలకు అనగా చేపలు, రొయ్యల చెరువులకు మళ్ళించి కుండా చూడాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఎక్కడైనా ఎవరైనా మంచి నీటి చౌర్యానికి పాల్పడితే వారిని వెంటనే అరెస్టు చేయించాలని ఆదేశించారు. రానున్న ఆరు మాసాలు మంచినీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో అక్టోబర్ 8 నాటికి సాధారణ వర్షపాతం కంటే 38.9 శాతం లోటు నమోదైందని, 21జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో పంట నష్టం అంచనాలను ఈ నెల 17లోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాల పంపిణీ, ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులకు ప్రభుత్వ మద్దతు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య హెచ్చరికలను క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిశీలించి, పెండింగ్ వివరాలను పూర్తి చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయడం, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా, బోర్ల మరమ్మతులు, నీటి వనరుల సంరక్షణ, >>2



## నిరసనలు మీవాక్కు శాంతి పరిరక్షణ మా బాధ్యత: సుప్రీం

**ప్రజారవాణా స్తంభింప చేయొద్దని ప్రభుత్వానికి సూచన**

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** నిరసన కార్యక్రమం నేపథ్యంలో భద్రతా చర్యల పేరుతో ఢిల్లీలో ప్రజా రవాణా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయరాదని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయడం, రైళ్లను రద్దు చేయడం వంటి చర్యలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు అధికారులు తీసుకుంటున్న చర్యలపై కోర్టు స్పందించింది. మేము ఈ నగరంలోని సామాన్య పౌరుల తరఫున మాట్లాడుతున్నామని సీజేఐ పేర్కొన్నారు. అలాగే నిరసన మీ హక్కు అయినప్పటికీ శాంతిభద్రతల పరిరక్షణ కూడా మా బాధ్యత అని సిజెపికి చురకలువేసారు. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ ఉద్యోగాలు, విద్య కోసం ప్రయాణించే వేలాది మందిని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ కారు ఉండదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత రవాణా సౌకర్యం అందుబాటులో ఉండదు. ప్రజలు ప్రజా రవాణాపైనే ఆధారపడతారు. ఈ విధంగా చేయడం సరికాదు. మెట్రో స్టేషన్లను మూసివేయడంపై మాకు తీవ్ర ఆందోళన ఉంది. జీవనోపాధి కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల గురించి మేము ఆలోచిస్తున్నాం. సామాన్య పౌరులు ఇబ్బందులు పడకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల రాకపోకలను నియంత్రించేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని కోర్టు పేర్కొంది.ఆ చర్యల కారణంగా ప్రజారవాణా సౌకర్యాలు >>2



## 14న విజయవాడకు రాష్ట్రపతి రాక
### కనకదుర్గమ్మను దర్శించుకోనున్న ద్రౌపది ముర్ము

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబరు 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబరు 11నుంచి 20వ తేదీ వరకు పదిరోజులపాటు ఈఉత్సవాలు >>2

# 'శాంతి' నవనీతం



## భారత సంతతి మహిళకు అత్యున్నత నోబెల్ పురస్కారం

- దక్షిణాఫ్రికాలో హైకోర్టు న్యాయమూర్తిగా చేసిన నవనీతం పిళ్లై
- మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాటం
- 2008-14 మధ్య యుఎన్ హెచ్‌ఆర్‌సి హైకమినర్‌గా విధులు
- తమిళ మూలాలున్న నవనీతం పిళ్లై కుటుంబం తాతల కాలంలోనే సౌతాఫ్రికాకు వలస

**స్టాక్‌హోమ్, అక్టోబరు 9:** నవనీతం 'నావి' పిళ్ళైకి 2026 నోబెల్ శాంతి బహుమతి వరించింది. భారతీయ తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా పౌరురాలైన పిళ్ళై, దక్షిణాఫ్రికా హైకోర్టులో న్యాయ మూర్తిగా పనిచేసిన మొదటి శ్వేతజాతేతర మహిళ. 85యేళ్ల వయసున్న ఆమె, ఐక్యరాజ్యసమితి (యుఎన్) మానవ హక్కుల విభాగం అధిపతిగా, రువాండా మారణకాండ ట్రిబ్యునల్ (న్యాయ స్థానం)కు నాయకత్వం వహించిన ప్రముఖ న్యాయ నిపుణురాలు. ఆమె ప్రస్తుతం అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. శాంతి మరియు అంతర్జాతీయ చట్టాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషికి గాను పిళ్ళైకి ఈ గుర్తింపు లభించిందని నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ తెలిపారు. పిళ్ళై "అంతర్జాతీయ చట్టం పరిధిని, ప్రభావాన్ని గణ నీయంగా విస్తరించారు, మరింత సమగ్రమైన ప్రపంచ న్యాయ వ్యవస్థ దిశగా మార్గం సుగమం చేశార్లు అని >>2

# ఢిల్లీ అష్టదిగ్బంధనం



- నేడు ఆందోళనలకు సిజెపి సిద్ధం
- అనుమతిలేదన్న పోలీసులు
- జంతర్‌మంతర్, ఇతర కీలక ప్రాంతాల్లో 35వేలమంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు
- 4కి.మీ పరిధిలో ఇంటర్నెట్ నిలిపివేత
- మెట్రో స్టేషన్లు మూసివేత
- ఆరు చోట్ల డిటెన్షన్ సెంటర్లు ఏర్పాటు

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** దేశ రాజధాని నగరం పరిసరాలు ఇపుడు భారీ భద్రతా వలయంలో ఉన్నాయి. కాక్రోచ్‌జనతాపార్టీ ఆధ్వర్యంలో సిఇసి జ్ఞానేశ్‌కుమార్ గద్దెదిగాల్సిందేనంటూ చేస్తున్న ఆందోళన దృష్ట్యా నగరంలో బందోబస్తును పటిష్టంచేసారు. సిఇసి రాజీనామా చేయాలని, సర్ వ్యవస్థను రద్దుచేసి పాత విధానమే కొనసాగించాలంటూ ఇటు ఇండియా కూటమి పార్టీలతోపాటు సిజెపీ కూడా తీవ్రస్థాయిలో ఉద్యమించిన సంగతి తెలిసిందే. అవసరమైన చట్టాలను ముందే సిద్ధంచేసుకున్న ఢిల్లీపోలీసులు సిజెపి ధర్నాకు >>2



శుక్రవారం రాష్ట్రపతి భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఇండియా కూటమి నేతలు

## జ్ఞానేశ్ రాజీనామా చేయవలసిందే..

- ఎన్నికల అక్రమాలపై రాష్ట్రపతి ముర్ముకు ఫిర్యాదు చేసిన 'ఇండి' నేతలు
- బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
- రాష్ట్రపతిని కలిసిన బృందంలో ఖర్గే, రాహుల్, మమత ప్రభృతులు

**న్యూఢిల్లీ,అక్టోబరు 9:** దేశ ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఫిర్యాదుచేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పలువురు ఎంపీలు, వివిధ పార్టీల నాయకులు >>2

10-10pg2exHMNWJQE.qxd:10-10pg2exHMNWJQE.qxd 1/1/02 8:31 AM Page 1





శుక్రవారం కొండపి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సిఎం చంద్రబాబు

# రైతులు అర్జీలు కాదు..హాలాన్ని పట్టుకోవాలి

>> అందిస్తున్నామని చెప్పారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నర్సింగోలులో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' గ్రామసభలో ఆయన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. గత పాలనలో భూములకు భద్రత లేకుండా పోయిందని, ఆక్రమణలు, దందాలు, భూ వివాదాలతో రెవెన్యూ వ్యవస్థను దెబ్బతీశారని ముఖ్యమంత్రి విమర్శించారు. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకుని, సర్వే రాళ్లపై రాజకీయ నాయకుల బొమ్మలు పెట్టారని వ్యాఖ్యానించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములపై వివాదాలు సృష్టించారని, అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు. గతంలో రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్నవారి భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 16.48 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని వెల్లడించారు. కంగుంది, అమలాపురం, శెట్టిపల్లి తదితర ప్రాంతాల్లో వివాదాల్లో ఉన్న 41 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని చెప్పారు. ప్రకాశం జిల్లాలో నాలుగు మండలాల్లోని 2,315 ఎకరాల గర్భ కండ్రిక భూముల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని వివరించారు. పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకే ప్రతినెలా ప్రజల ముందుకు వస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం సక్రమంగా పూర్తయ్యేంత వరకూ రైతుల వద్దకు వస్తూనే ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వయంగా పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నానన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 40.58 లక్షల పట్టా దారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశామని వెల్లడించారు. అక్టోబరులోనే 790 గ్రామాల్లో నాలుగు లక్షలకు పైగా రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. ఇంకా పంపిణీ చేయాల్సిన 51 లక్షల పాస్ పుస్తకాలకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, అర్హులైన రైతులందరికీ అందిస్తామని చెప్పారు. చిట్టచివరి రైతు వరకూ పారదర్శకంగా హక్కు పత్రాలు అందించడమే లక్ష్యమని సిఎం స్పష్టం చేశారు.

**రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్:** ప్రకాశం జిల్లాలోని ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు పోతుల చెంచయ్య-పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రూ.166.40 కోట్లతో రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రిజర్వాయర్ ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లో 35 వేల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. పొన్నలూరు మండలం వేమూరుపాడు రహదారి, పాలేరు నదిపై వంతెన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశామని తెలిపారు. రూ.28 కోట్లతో ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చామని చంద్రబాబు చెప్పారు. ఆ ప్రాజెక్టు రెండో దశను కూడా పూర్తిచేసి అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. నీరు అందుబాటులోకి రాకుండానే రిబ్బన్లు కట్ చేయడం, ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినట్లు ప్రచారం చేసుకోవడం తమ విధానం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 40 చిన్నా పెద్ద నదులను అనుసంధానించి నీటి గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించవచ్చన్నారు. గోదావరి నుంచి కావేరి వరకు అనుసంధానం జరిగితే నాలుగు రాష్ట్రాల్లో నీటి కొరతను అధిగమించే అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.35 వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భూగర్భ జలాల పెంపునకు కూడా పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నామని సిఎం చంద్రబాబు వివరించారు.

**గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో ప్రకాశం అభివృద్ధి:** ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలను ప్రపంచ స్థాయి ఉద్యానవన పంటల కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పల్లె పండుగ ద్వారా రూ.11 వేల కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, మంగళగిరి తదితర ప్రాంతాల్లో 60 వేల మందికి నివాస స్థలాలపై హక్కులు కల్పించామని, వాటి మార్కెట్ విలువ రూ.52 వేల కోట్లుగా ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, అదనంగా మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా అమరజీవి జలధార కింద రూ.31 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించేలా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామని చంద్రబాబు చెప్పారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రూ.1.5 లక్షల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని సీఎం వెల్లడించారు. రామాయపట్నం పోర్టు గతంలోనే పూర్తి కావాల్సి ఉన్నా నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు.

**ప్రజాభిప్రాయం ఆధారంగా పాలనలో మార్పులు:** ప్రజల బాగోగులే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేవుడిని ప్రార్థించే సమయంలో కుటుంబానికి మంచి జరగాలని కోరుకోవడంతో పాటు, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వ పనితీరుపైనా ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను ఫోన్ ద్వారా నేరుగా తెలుసుకుని, అవసరమైన మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు నమోదు చేసి, పౌరసేవల్లో పారదర్శకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాలను మరింత పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాల శ్రీవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### బిసిలకు పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు

>> 24 శాతానికి తగ్గించడం వల్ల అనేకమంది నష్టపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయితే న్యాయస్థానాలతీర్పులతో ఆ రిజర్వేషన్ల అమలుకు ఆటంకం ఏర్పడిందన్నారు. సుప్రీంకోర్టు సంబంధిత జిఒను కొట్టివేసినప్పటికీ, పార్టీ పరంగా బిసిలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించి అండగా ఉంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఓటమి తప్పదనే సర్ పేరిట స్థానిక ఎన్నికలను కూడా అడ్డుకోవాలన్న ఆలోచనతోనే గొడ్డలి పార్టీ కోర్టులకు వెళ్లిందని సిఎం చంద్రబాబు ఆక్షేపించారు.

# నీటి చౌర్యం చేస్తే అరెస్టు చేయండి

>> లీకేజీల నివారణ చేపట్టాలని సూచించారు. 2027 వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లా స్థాయిలో పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉద్యాన పంటల పరిరక్షణకు సూక్ష్మ సేద్యం, వ్యవసాయ కుంటలు, సేంద్రియ మల్చింగ్, అవసరమైన రైతులకు అత్యవసర నీటి సరఫరా వంటి చర్యలను వేగవంతం చేయాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ పట్టణ స్థానిక సంస్థల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించామని వివరించారు. 23 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేక సమ్మర్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా తాగునీటిని వృథా చేయకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. రానున్న ఆరు మాసాల్లో ఎక్కడా మంచినీరు అందలేదని ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై ప్రెజెంటేషన్ ఇస్తూ ఎల్నినో వల్ల రాష్ట్రంలో 514 మండలాలు ప్రభావితం కాగా ఇప్పటికే 388 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని తెలిపారు. తాగునీటి ఎద్దడి అధికంగా ఉండే మండలాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజతో పాటు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# 14న విజయవాడకు రాష్ట్రపతి రాక

>> అత్యంత వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబరు 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు సిఎం చంద్రబాబు సమర్పిస్తారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వివిపి దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఇఒ వి.కె. శీనా నాయక్ తెలిపారు.

# స్థానిక ఎన్నికలకు సుప్రీం గ్రీన్‌సిగ్నల్

>> సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే నోటిఫికేషన్ విడుదలలోపు 'సర్ప్ ప్రక్రియ పూర్తైతే ఆ జాబితానే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు ఎస్ఇసికి సూచించింది. సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎపి హైకోర్టు ఇచ్చిన తీర్పును సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇబ్బంది పడేవారికి లేని బాధ మీకెందుకని వైఎస్సార్సీపి లాయర్‌ను కోర్టు నిలదీసింది. ఎన్యూమరేటర్లు, ప్రభుత్వం, కేంద్రం ఎవరికీ లేని నొప్పి మీకెందుకని ప్రశ్నించింది.

# హైకోర్టు తీర్పుకు సుప్రీం సమర్థన

>> రని ధర్మాసనం వ్యాఖ్యానించగా, నివేదిక ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ వివరించారు. ఫ్యామిలీ డేటాను డెడికేటెడ్ కమిషన్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. నివేదిక ఆమోదం లేకుండా డేటా తీసుకోవడంలో హైకోర్టు కారణం సరిగానే ఉందన్న సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

**న్యాయస్థానాల తీర్పు ఎలా ఉన్నా..బిసిలకు అండగా నిలుస్తాం: సిఎం చంద్రబాబు భరోసా**

న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బిసిలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని సిఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. బిసి రిజర్వేషన్ల బిల్లును సుప్రీంకోర్టు కొట్టేయడంపై ఆయన సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బిసిలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బిసిలకు 34శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసిపి సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బిసిల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం బిసిల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బిసిలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

# గెజిట్ ఇస్తేనే నోటిఫికేషన్

>> నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందనితెలిపారు. 'సర్ప్ ప్రక్రియ తర్వాత చేపట్టిన ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహి స్తామని ఎస్ఇసి చెప్పుకొచ్చారు. రిజర్వే షన్లు ఖరారైతే రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఆ తర్వాతే స్థానిక నోటిఫికేషన్ ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనల ఆధారంగా ఈ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉంటామని ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

# 'శాంతి' నవనీతం

>> ఆయన పేర్కొన్నారు. దక్షి ణాఫ్రికాలో తీవ్ర వివక్షను ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె సుదీర్ఘ కెరీర్‌ను నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్మన్ ప్రశంసించారు. "మరింత శాంతియుత ప్రపంచాన్ని నిర్మించాలని కోరుకునే వారందరికీ పిళ్ళై కృషి ఒక ఆశాకిరణం, స్ఫూర్తిదాయకం" అని ఆయన అన్నారు. పిళ్ళై విజయాన్ని ప్రకటిస్తూ, "యుద్ధాలు, సంఘర్షణలు పెరుగుతున్న తరుణంలో, అలాగే అంతర్జాతీయ చట్టానికి సంబంధించిన న్యాయమూర్తులు, సంస్థలు రాజకీయ దాడులకు గురవుతున్న సమయంలో, బలప్రయోగం లేదా హింస లేకుండా సంఘర్షణలను పరిష్కరించుకునే సామర్థ్యం అంతర్జాతీయ న్యాయ పాలనపైనే ఆధారపడి ఉంటుందని నోబెల్ కమిటీ గుర్తుచేయాలనుకుంటోంది. యుద్ధ నేరస్థులను జవాబుదారీగా ఉంచే, దుర్వినియోగానికి గురైన బాధితులకు న్యాయం జరిగే అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ, శాంతియుత ప్రపంచానికి ఒక ముందస్తు షరత్తు అని అని నోబెల్ కమిటీ పేర్కొంది. "శాంతి, అంతర్జాతీయ చట్టాన్ని ప్రోత్సహించడానికి ఆమె చేసిన కృషికిగాను ఆమెను ఈ బహుమతికి ఎంపికచేశారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ అభివృద్ధిలో పిళ్ళై ముందంజలో ఉన్నారని, విజేతను ఎంపిక చేసే నార్వేజియన్ నోబెల్ కమిటీ పేర్కొంది.

**నవీ పిళ్ళై ఎవరంటే...:** పిళ్ళై 1941లో దక్షిణాఫ్రికాలోని నాటల్ ప్రావిన్స్‌లోని దర్బన్‌లోని ఒక పేద ప్రాంతంలో నారాయణస్వామి నాయుడు, శాంతమా నాయుడు దంపతులకు జన్మించారు. ఆమె తాతముత్తాతలు 1890లలో దక్షిణాఫ్రికాలోని చక్కెర తోటలలో పనిచేయడానికి ఒప్పంద సేవకులుగా భారతదేశం నుండి వచ్చారు. ఒక బస్ డ్రైవర్ కుమార్తె అయిన పిళ్ళై, వర్ణవివక్ష కాలంలో పెరిగి, తన మానవ హక్కుల ఉద్యమాన్ని ప్రారంభించారు. వర్ణవివక్ష వ్యతిరేక కార్యకర్తల తరఫున వాదించడం ద్వారా తన న్యాయవాద వృత్తిని ప్రారంభించిన పిళ్ళై, 1967లో తన సొంత న్యాయ సంస్థను స్థాపించారు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద జరిగిన ఒక విచారణలో హింస, చట్టవిరుద్ధమైన విచారణ పద్ధతుల వాడకాన్ని బహిర్గతం చేసిన ప్రతివాద బృందంలో భాగంగా ఆమె గుర్తింపు పొందారు. 1973లో, రాబెన్ ద్వీపంలోని నెల్సన్ మండేలాతో సహా రాజకీయ ఖైదీలకు న్యాయవాదులను సంప్రదించే అవకాశం, మరికొన్ని ప్రాథమిక హక్కులు లభించేలా ఒక కేసును గెలిపించి ఆమె మరో ముఖ్యమైన విజయాన్ని సాధించారు. వర్ణవివక్ష పాలన ముగిసిన తర్వాత 1995లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన పిళ్లై, 1999లో రువాండా కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ (ఐసిటిఆర్)కు న్యాయమూర్తిగా, అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. హుటు నాయకుడు జీన్‌పాల్ అకాయేసు విచారణ సందర్భంగా, అత్యాచారం, లైంగిక హింసను యుద్ధ నేరాలుగా పరిగణించవచ్చని నిర్ధారించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ద్వేషపూరిత ప్రసంగాలు, ముఖ్యంగా సామూహిక ప్రసార మాధ్యమాల్లో చేసేవి యుద్ధ నేరాలుగా విచారించబడతాయని తీర్పునిచ్చిన మరో ముఖ్యమైన కేసులో కూడా ఆమె పాలుపంచుకున్నారు. ఆ తర్వాత 2003లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసిసి) న్యాయమూర్తిగా నియమితులైన పిళ్లై, 2012లో ముగియాల్సిన తన పదవీకాలం పూర్తికాకముందే 2008లో ఆ పదవికి రాజీనామా చేశారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమిషనర్ (ఒహెచ్‌సిహెచ్‌ఆర్)గా బాధ్యతలు చేపట్టేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఆమె నాలుగేళ్ల పదవీకాలం (2008-12) మరో రెండేళ్లు పొడిగించబడింది. మయన్మార్‌పై నరమేధ ఆరోపణలు చేస్తూ పశ్చిమ ఆఫ్రికా దేశమైన గాంబియా దాఖలు చేసిన కేసులో, 2019లో ఆమె అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె)లో తాత్కాలిక న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఈ కేసులోని వాస్తవాంశాలపై విచారణలు ఈ యేడాది జనవరిలో జరిగి ముగిశాయి. మే 2021లో ఇజ్రాయెల్- పాలస్తీనా ఘర్షణల నేపథ్యంలో ఏర్పాటు చేసిన 'ఆక్రమిత పాలస్తీనా భూభాగాలపై ఐక్యరాజ్యసమితి స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు 2021లో పిళ్లై అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. నవంబరు 2025 వరకు ఆ పదవిలో కొనసాగారు. అక్టోబర్ 2023 దాడుల తర్వాత హమాస్, ఇజ్రాయెల్ రెండూ యుద్ధ నేరాలకు పాల్పడ్డాయని ఈ కమిషన్ జూన్ 2024లో నిర్ధారించింది. అలాగే, గాజాలో చేపట్టిన సైనిక చర్యల్లో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడిందని సెప్టెంబరు 2025లో ఆరోపించింది. అంతకుముందు, తన స్వదేశీయుడు, న్యాయ నిపుణుడు అయిన జాన్ దుగార్డ్‌తో కలిసి పిళ్లై 'ఓలోఫ్ పామ్ ప్రైజ్‌ను కూడా అందుకున్నారు.

**నోబెల్ శాంతి బహుమతి కోసం 287 నామినేషన్లు:** నోబెల్ శాంతి బహుమతిని అత్యంత ప్రతిష్టాత్మకమైన గౌరవంగా పరిగణిస్తారు. ఈ సంవత్సరం ఈ శాంతి బహుమతి 125వ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది. ఓస్లోలోని నార్వేజియన్ నోబెల్ కమిటీ ఈ సంవత్సరం బహుమతి కోసం 287 అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించింది, వాటిలో 25శాతం కంటే కొంచెం ఎక్కువ సంస్థలు ఉన్నాయి. కమిటీ సాధారణంగా శాంతి, సుస్థిరత, అంతర్జాతీయ సౌభ్రాతృత్వం, ప్రోత్సాహం, ఆ లక్ష్యాలను బలోపేతం చేసే సంస్థల నిశ్శబ్ద కృషిపై దృష్టి పెడుతుందని నిపుణులు అంటున్నారు. గత సంవత్సరం, వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో, ఆ దక్షిణ అమెరికా దేశంలో ప్రజాస్వామ్య పరివర్తనను సాధించడానికి చేసిన పోరాటానికి నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్నారు, "పెరుగుతున్న చీకటి మధ్య ప్రజాస్వామ్య జ్యోతిని వెలిగిస్తూ ఉండే మహిళ"గా గుర్తింపు పొందారు. అమెరికా అప్పటి అధ్యక్షుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన కొద్దికాలానికే మచాడో తన నోబెల్ పతకాన్ని ట్రంప్‌కు అందజేశారు. అయితే, అది ప్రధానంగా ఒక ప్రతీకాత్మక చర్య మాత్రమే. ఆ గౌరవాన్ని వేరొకరికి బదిలీ చేయడం సాధ్యం కాదని నోబెల్ కమిటీ పేర్కొంది.

## నిరసనలు మీహక్కు శాంతి పరిరక్షణ మా బాధ్యత: సుప్రీం

>> పూర్తిగా అందుబాటులో లేకుండా చేయరాదని తెలిపింది. అల్లర్లకు పాల్పడే గుంపులను నియంత్రించండి. కానీ సామాన్య పౌరులకు ఇబ్బంది కలిగించే చర్యలు తీసుకోవద్దని సీజేఐ ప్రభుత్వానికి సూచించారు. ప్రజా రవాణా పూర్తిగా నిలిచిపోకుండా చూడాలి సీపీఐ(ఎం) నేత ఎం.ఎ. బేబీ దాఖలు చేసిన పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, రైళ్ల రద్దు అంశాన్ని కూడా పరిశీలించాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పరిస్థితులను బట్టి రైలు సేవలను నియంత్రిస్తామని ధర్మాసనానికి హామీ ఇచ్చారు.



బిఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతి సందర్భంగా శుక్రవారం లక్నోలో నివాళులర్పిస్తున్న మాయావతి

# నేడు కేబినెట్ భేటీ

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో జరుగనుంది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుపై మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకోనుందని సమాచారం. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వ అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడంపై సమావేశం కీలకంగా చర్చించనుంది. సుప్రీం కోర్టులోనే ఈ అంశంలో రివిజన్ పిటిషన్‌కు అవకాశం ఉందా?. గతంలో మాదిరిగానే ఎన్నికలు నిర్వహించడమా? లేదా మరో ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించడమా? అనే అంశాలను మంత్రివర్గంలో చర్చిస్తారంటున్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌పై చర్చించేందుకు కేబినెట్ సమావేశం కానుంది. బిసిలకు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సు చేసిన రిజర్వేషన్లు, జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొని వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించనున్నట్లు సమాచారం. మంత్రివర్గం నిర్ణయానికి అనుగుణంగా వెంటనే జిఒలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో బిసి రిజర్వేషన్లపై విడుదల చేసిన జిఒలను ప్రభుత్వం ఉపసంహరించుకోనున్నట్లు సమాచారం. కేబినెట్ సమావేశానికి మంత్రులందరూ రావాలని సచివాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

# ఢిల్లీ అష్టదిగ్బంధనం

>> అనుమతిని నిరాకరించారు. అలాగే ఎలాంటి ర్యాలీలు కూడా తీయడానికి వీలులేకుండా ఆంక్షలు అమలుచేస్తున్నారు. ఢిల్లి మెట్రోసేవలు బంద్ అయ్యాయి. జంతర్‌మంతర్ చుట్టూ నాలుగుకిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సర్వీసులు మొత్తం నిలిపివేసారు. సుమారు 35 వేల మంది బలగాలతో భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేయడంపాటు ఎక్కడికక్కడ అరెస్టులుచేసేందుకుగాను నగరపరిధిలో మొత్తం ఆరు డిటెన్షన్ సెంటర్లు కూడా ఏర్పాటుచేసారు. అయినప్పటికీ కూడా సిజెపి చీఫ్ అభిజీత్‌దీప్కే, సౌరభ్‌దాస్ వంటి నేతలు ఢిల్లీలో నిరసన నిర్వహిస్తామని ఆగేదిలేదని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. వచ్చే పోయే వాహనాలన్నింటినీ నగర సరిహద్దుల్లోనే నిలిపివేయాలని నిర్ణయించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన అధికారిక ప్రైవేటు కార్యక్రమాలన్నింటినీ రద్దుచేసుకుని పదవతేదీ ఆందోళన పైనే దృష్టిపెట్టారు. ఢిల్లీపోలీస్ మొత్తం హోంశాఖపరిధిలోనే ఉండటంతో అమిత్‌షా ప్రత్యేకంగా దృష్టిపెట్టి ఎప్పటికప్పుడు సూచనలు జారీచేస్తున్నారు. జంతర్‌మంతర్‌వద్ద భారీఎత్తున నిర్వహించనున్న నిరసన ప్రదర్శనల కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఢిల్లీలోని న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు 10న ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య చేరుకోవాల్సిన పలు మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఈ రెండు స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటూ రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్‌ప్లస్ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక పోలీస్ బలగాల తోపాటు ఢిల్లీపోలీసులు సర్విలెన్స్ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షణచేస్తున్నారు. ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్‌ప్లస్ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఢిల్లీని మొత్తం పోలీసులతో దుర్భేద్యవలయంగా మార్చేసారు. ప్రత్యేకపోలీస్ బలగాలతోపాటు ఢిల్లీపోలీసులు సర్విలెన్స్ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

# జ్ఞానేశ్ రాజీనామా చేయవలసిందే..

>> పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ దిశగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారిలో కొందరు రాష్ట్రపతిని కలిసి తమ డిమాండ్లతో కూడిన మూడు అంశాల వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, వివాదాస్పద ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించినట్లు పేర్కొంటున్న 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరాయి. రాష్ట్రపతితో సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న తమ ఆరోపణలను రాష్ట్రపతి తోసిపుచ్చలేదని, అయితే ఆధారాలు సమర్పించాలని కోరారని తెలిపారు. ఎన్నికలను ఎలా తారుమారు చేశారనే విషయానికి తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని, దేశమంతా ఈ పరిణామాలను చూసిందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆందోళనలు ప్రభుత్వ పునాదులను కదిలించాయని పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలు, నేతల సమావేశంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే మాటాడుతూ తమ ప్రతినిధిబృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి మెమొరాండం అందచేసారని ఓట్ల చోరీ జరిగిందని, ఈవిఎంలను పక్కనపెట్టి బ్యాలట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించే విధానం రావాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రపతికి తమ ప్రతినిదిబృందం మొత్తం వివరాలు ఇచ్చిందని ఖర్గేచెప్పారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సుమారు 150 మంది ఎంపీలు, ఇతర ప్రతిపక్ష నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 16 పార్టీలకు చెందిన 16 మంది నాయకులు రాష్ట్రపతికి సమర్పించే వినతి పత్రంపై సంతకాలు చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై తమ ఆం దోళనలను అందులో వివరించారు. రాష్ట్రపతిని కలిసేందుకు 10 మంది నేతల బృందం వెళ్లగా, మిగిలిన నాయకులు కర్తవ్య పథ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు.

## వారం - వర్జ్యం

10-08-2026, శనివారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,
తి. అమావాస్య రా .9.23,
న. హస్త రా.9.45,
వ.లేదు,
దు.తె .5.58-ఉ.7.33,
రాహు :ఉ.9.00- ఉ.10.30,
శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం** :మానసిక వత్తిడి నుండి బయటపడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు. వాహన యోగ సూచన.

**వృషభం** : మీ ప్రతిభా పాటవాలు వెలుగు చూస్తాయి. శుభకార్య చర్చలు సాగిస్తారు. పోటీ పరీక్షలలో విజయాన్ని సాధిస్తారు.

**మిథునం** :వస్తు భద్రత పట్ల అప్రమత్తత అవసరం. వృత్తి, ఉద్యోగాల వరంగా అభివృద్ధిని సాధిస్తారు.

**కర్కాటకం** :అంతరంగిక భయాన్ని కలిగి ఉంటారు. ఎక్కువగా ఊహాలోకాలలో విహరిస్తారు. మాట తీరులో మార్పులు.

**సింహం** : కష్టించి పని చేస్తారు. మీ అంచనాలు నిజమవుతాయి. ఋణం ఇవ్వడం లేక ఋణం తీసుకోవడం జరుగుతుంది.

**కన్య** : మనీ రొటేషన్ స్కీంల పట్ల ఆకర్షితులవుతారు. గృహం లేక వాహన కొనుగోలు సానుకూల పడుతుంది.

**తుల** : ఆర్థికంగా స్వల్పమైన ఒడిదుడుకులు ఏర్పడతాయి. ఆరోగ్యం నలతగా ఉంటుంది. గ్రంథపఠనం చేస్తారు.

**వృశ్చికం** : స్థిరాస్తి వ్యవహారాలకు ప్రాముఖ్యతనిస్తారు. కుటుంబ విషయాల పట్ల దృష్టిని సారిస్తారు. జనసమీకరణలు చేస్తారు.

**ధనుస్సు** :మీలోని సృజనాత్మక వెలుగు చూస్తుంది. సంగీత, సాహిత్యాల పట్ల అభివృద్ధిని కనబరుస్తారు.

**మకరం** : చేజారిపోయాయి అనుకున్న అవకాశాలు తిరిగి చేరువవుతాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి.

**కుంభం** : విలక్షణమైన శైలిని కనబరుస్తారు. చర్చలను, సంప్రదింపులను సాగిస్తారు. పరోపకార బుద్ధిని కలిగి ఉంటారు.

**మీనం** :బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. టీం వర్క్, టీం స్పిరిట్తో పూర్తి చేస్తారు. ఆలోచనలు మెరుగ్గాసాగుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారత్ పైలట్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం

**టెల్అవీవ్, అక్టోబరు 9:** భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ విమానంలో సహ పైలట్ దాడి చేసినా వెనక్కి తగ్గలేదు.. తీవ్రంగా గాయపడినా ధైర్యంగా పోరాడి 174 మంది ప్రాణాలను కాపాడారు. ఆయన సాహసానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవం ప్రకటించింది. దేశ అత్యున్నత పౌర సాహస పురస్కారాన్ని అందించనున్నట్లు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. మచ్చర్ కోలుకున్న తర్వాత స్వయంగా పురస్కారాన్ని అందజేస్తానని తెలిపారు. ఈ ఘటనలో ధైర్యంగా వ్యవహరించిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు సైతం హెర్జోగ్ పౌర సాహస పురస్కారాలను అందించారు. తాలి మేనెస్, జ్వికా మేనెస్, యానివ్ హాయూన్, డాక్టర్ షోటా ముసాయేవ్, అసఫ్ రజువాన్, ఓర్ పార్దిలోవ్‌లను జెరూసలేంలోని అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. విమానంలో జరిగిన భయానక ఘటనను మచ్చర్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పంచుకున్నారు. ఇజ్రాయెల్ తదుపరి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి వేడుక జ్యోతిని వెలిగించాల్సిందిగా మచ్చర్‌ను నెతన్యాహు ఆహ్వానించారు. గతవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. విమాన సహ పైలట్ హామామ్ అల్ హామామీ కాక్‌పిట్‌లోని గొడ్డలితో మచ్చర్‌పై దాడి చేశాడు. అనంతరం విమాన నియంత్రణను తన చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనను ఉగ్రదాడిగా యూఏఈ అధికారులు అభివర్ణించారు. తనపై దాడి జరిగినా మచ్చర్ ప్రతిఘటించారు. గాయాలతోనే కాక్‌పిట్ తలుపు తెరిచారు. దీంతో లోపలికి వచ్చిన ప్రయాణికులు దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి సాహసంతో విమానం ప్రమాదానికి గురికాకుండా నిలువరించగలిగారు.

10-10Pg3exHMNWJQEGROTB.qxdO/P:10-10Pg3exHMNWJQEGROTB.qxd 1/1/02 8:53 AM Page 1



## నిబంధనల సరళీకరణ, అనుసరణ భారాల తగ్గింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

● పెండింగ్ సంస్కరణలను గడువులోగా పూర్తి చేయాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** నిబంధనల సరళీకరణ, అనుసరణ భారాల తగ్గింపు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, కేంద్ర ఉక్కుశాఖ కార్యదర్శి సందీప్ పాండ్రిక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వారు రెండో దశలో నిబంధనల భారాన్ని తగ్గించడం, నియంత్రణల సడలింపు అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, పరిశ్రమలు, వాణిజ్యం, లీగల్ మెట్రాలజీ శాఖల వారీగా పురోగతి, పెండింగ్ అనుమతులు,చట్ట సవరణలు, జారీ చేయాల్సిన ఉత్తర్వులపై సమీ క్షించారు. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆట స్థలాలు, ప్రయోగశాలలు తదితర నిబంధనలను సరళీకరించడం, గుర్తింపు కోసం అవసరమైన ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్ స్థానంలో స్వీయ ధృవీకరణ విధానాన్ని ప్రవేశపెట్టడం, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు భూమి మరియు ఎండోమెంట్ ఫండ్ అవసరాలను తగ్గించడం వంటి ప్రతిపాదనలపై సమీక్షించారు. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు అవసరమైన నిరభ్యంతర పత్రాలు, బహుళ లైసెన్సుల సంఖ్యను తగ్గించడం, లీలీలీనిలకు స్వీయ ప్రకటన ఆధారంగా వ్యాపార కార్యకలాపాల ప్రారంభానికి అవకాశం కల్పించ డం, తక్కువ ప్రమాద స్థాయి పరిశ్రమలకు అనుమతులు, తనిఖీల ప్రక్రియను సరళీకరించడం వంటి సంస్కరణలను వేగవంతం చేయాలని చెప్పారు.లీగల్ మెట్రాలజీ విభాగంలోనూ రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల జారీని సులభతరం చేసే చర్యలను ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, చట్ట సవరణలు, నోటిఫికేషన్లను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసి, అనవసరమైన అనుమతులు, జాప్యాలను తగ్గించడం ద్వారా వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించి, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కార్యదర్శి సరిత చౌహాన్ చంద్ పాల్గొన్నారు.



శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, చిత్రంలో ఇతర అధికారులు

# గృహ నిర్మాణాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశం

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గృహ నిర్మాణ పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి గృహ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్ల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పనితీరు వెనుకబడిన జిల్లాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 కింద అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, శాశ్వత వెయిటింగ్ జాబితా పరిశీలన, అవసరమైన ధ్రువపత్రాల అప్‌లోడ్, నిర్దేశిత తనిఖీలను పూర్తి చేసి ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన లబ్ధిదారుల కోసం గ్రామాల వారీగా జాబితాలు సిద్ధం చేసి, ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో ఖాళీ స్థలాలు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను ప్రాధాన్యంగా వినియోగించాలని సూచించారు. అవసరమైన చోట ప్రైవేటు భూముల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, అక్టోబర్ 17లోగా భూసేకరణ బడ్జెట్ అంచనాలను సమర్పించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనుల నాణ్యత, ఆర్థిక పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న సహాయంపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో భూ కేటాయింపులు, నిర్మాణ అనుమతులు, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలని సూచించారు.

**సంజీవని ఆరోగ్య సేవలను ప్రారంభించడానికి జిల్లాలు సర్వసన్నద్ధం కావాలి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న సంజీవని ఆరోగ్య సేవల అమలుకు జిల్లాలన్నీ సర్వసన్నద్ధం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమన్వయంతో కూడిన నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, ఐటీ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, వర్చువల్ వైద్య సంప్రదింపుల గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ల నియామకం,వైద్య సిబ్బందికి శిక్షణ,ఆరోగ్య కేంద్రాల నమోదు ప్రక్రియలను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని, కలెక్టర్లు ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.

వైద్య సదుపాయాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. అలాగే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు నీరు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల నివారణ చర్యలు, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో క్రిమిసంహారక చర్యలు, దోమతెరల పంపిణీని సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. తాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్లోరినేషన్, నీటి నమూనాల పరీక్షలు, పైపులైన్ల లీకేజీల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో బిసిలకు సముచిత స్థానం కల్పిస్తాం

● రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బిసిల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. బిసిలకు సంబంధించిన అంశాల్లో న్యాయస్థానాల నిర్ణయాలను గౌరవిస్తూనే వారికి రాజకీయంగా తగిన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక సందర్భంగా బిసిలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. బిసిల రాజకీయ ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి ఆత్మ గౌరవం, రాజకీయ సాధికారతకు పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బిసి వర్గాలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం లభించినప్పుడే వారి అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో బిసి రిజర్వేషన్లు 34శాతం నుంచి 24.15శాతానికి తగ్గిన విషయాన్ని ఆ వర్గాల ప్రజలు మరిచిపోలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని వైసిపిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బిసిలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడం, వారి హక్కులను కాపాడటం, సామాజికంగా మరింత ముందుకు తీసుకెళ్లడం తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. స్థానిక సంస్థల్లో బిసిల భాగస్వామ్యాన్ని పెంచేందుకు అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల ప్రక్రియ వరకు తగిన ప్రాధాన్యం కల్పించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. బిసిల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా, వారికి రాజకీయ సాధికారత కల్పించేలా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

● సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట నిఘా ● రౌడీషీటర్ల కదలికలపై డేగకన్ను

● రాయలసీమ జిల్లాల ఎస్పీలతో డిజిపి హరీష్‌కుమార్ గుప్త

**తిరుపతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ సిద్ధమైందని, పోలీసుశాఖ పరంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్త స్పష్టమైన ఆదేశాలిచ్చారు. గతంలో ఎన్నికలు జరిగిన తీరు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న విధానం, అక్కడి పరిస్థితులు, రాజకీయ నేపథ్యం, రౌడీషీటర్ల కదలికలు వంటి అంశాలపై సుదీర్ఘంగా ఆయన రికార్డులతో సహా సమీక్షించారు. శుక్రవారం మధ్యాహ్నం నుండి రాత్రి 10గంటల వరకు సుదీర్ఘంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ప్రశాంత వాతావరణం, పోలీసుశాఖ పరంగా తీసుకోవాల్సిన చర్యలుపై తిరుపతిలో రాయలసీమ జిల్లాలో కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, తిరుపతి,చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలతో క్షుణ్ణంగా సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికలను రాయలసీమ జోన్‌లో ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, సిద్ధంకావాలని ఆయన ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు ఇబ్బందులు కలిగించే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశనిర్దేశం చేశారు. ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని, రౌడీషీటర్లు, ఘర్షణలకు పాల్పడే అసాంఘిక శక్తులను గుర్తించి



ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు, మద్యం, ఆయుధాల రవాణాను అడునడకోవాలని, డిఐజిలు, ఆయా జిల్లాల ఎస్పీలు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలుగానీ, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఎస్పీలపై ఉందన్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటినుండే పోలీస్‌శాఖ సంసిద్ధమై చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్ష: తిరుమలలో రెండురోజుల్లో మొదలుకానున్న వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రతి భక్తుడికి పటిష్టమైన భద్రత కల్పించాలని డిజిపి గుప్త జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుకు ప్రత్యేక సూచనలు చేశారు. పోలీసుఅధికారులు, పోలీసులతో తిరుమల,తిరుపతిలో పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు సామాన్యభక్తులకు ఇబ్బంది కలగకుండా భద్రత ఏర్పాట్లుచేయలన్నారు. అధునాతన సిసికెమెరాలతో నిరంతరం అనుమానిత వ్యక్తుల కదలిలపై నిఘా ఉంచేలా చూస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల భద్రతపై, భక్తులకు కల్పించే సౌకర్యాలు, పోలీసుశాఖ పరంగా తీసుకున్న భద్రత ఏర్పాట్లపై డిజిపి హరీష్‌కుమార్ గుప్తఅనంతపురం రేంజి డిఐజి షిమోషిభాజ్‌పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్‌తో కలసి భక్తులకు భద్రతపరంగా తీసుకుంటున్న చర్యలుపై సమీక్షించారు. నాలుగు మాఢవీధుల్లో భక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడం, వెలుపలకు రావడం సమయాల్లో తొక్కిసలాట జరగకుండారోప్ పార్టీలతో పోలీసులతో పటిష్ట చర్యలు ప్రణాళికా బద్ధంగా ఉంటాయన్నారు. ఇన్నర్‌రింగు రోడ్డు నుండి గ్యాలరీల్లోకి భక్తులను క్షుణ్ణంగా తనిఖీచేసిన తరువాత అనుమతించడం జరుగుతుందన్నారు.

## సాయికృష్ణ ది మూమ్మాటికి హత్యే

శవాన్ని కాల్చిదాహనం చేసారు ● చార్జిషీట్‌లో సిట్ స్పష్టీకరణ

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) న్యాయస్థానానికి ప్రాథమిక ఛార్జిషీట్‌ను సమర్పించింది. విజయవాడ లోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ మృతికి పోలీసుల చిత్రహింసలే ప్రధాన కారణమని సిట్ తన నివేదికలో నిర్ధారించింది. ఈ కేసులో అప్పటి సిఐ నాగరాజుతో పాటు మొత్తం ఏడుగురు పోలీసులను నిందితులుగా పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసులో అత్యంత నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపినట్లు సిట్ కోర్టుకు వివరించింది. దర్యాప్తులో భాగంగా సుమారు 120 మంది సాక్షులను విచారించిన అధికారులు, కీలక ఆధారాలతో కూడిన 263 పత్రాలను 86 పేజీల ఛార్జిషీట్‌కు జతచేశారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడకు తరలించిన పోలీసులు, కృష్ణలంక స్టేషన్‌లో అతడిపై అమానవీయంగా దాడి చేసినట్లు తేలింది. ఈ దాడిలో సిఐ అత్యంత కర్కశంగా వ్యవహరించారని, అతని మిత్రుడు సురేష్(ప్రైవేట్ వ్యక్తి) ఈ ఘటనలో అమానుషంగా వ్యవహరించారని సిట్ చార్జిషీట్‌లో వివరించింది. వారికి హోంగార్డు, ఇతర పోలీసు సిబ్బంది సహకరించారని సిట్ పేర్కొంది. నిందితులు కస్టడీలో కట్టుకథలు చెప్పారనే అభిప్రాయం వ్యక్తం చేసింది. నిందితుల దాడిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సాయికృష్ణ మరణించే వరకు ఆగి అతని శవాన్ని దుప్పటిలో స్మశానానికి తరలించి, కాల్చి బూడిద చేసారని సిట్ ఆరోపించారు. ఈ ఘటనలో ఏడుగురు నిందితులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని, మిగిలిన వారు శవాన్ని మాయం చేయడానికి, సిసి పుటేజీ ధ్వంసం చేయడంలోను, లాకప్‌లో ఆధారాలు లేకుండా కడిగివేయడం, రంగులు వేయడంలో సహకరించారిని సిట్ చార్జిషీట్‌లో స్పష్టం చేసింది. ఈ కేసులో సిట్ ఇంకా లోతైన విచారణ చేస్తోందని, సాయికృష్ణ మృతి యాదృశ్చికం కాదని, పక్కా ప్రణాళికని సిట్ కోర్టు తెలిపినట్లు సమాచారం. హతున్ని ఎందుకు అంతగా వేధించి, హత్య చేసారనే అంశంలో కీలక సమాచారం త్వరలో కోర్టు ముందు ఉంచుతామని సిట్ కోర్టు తెలిపినట్లు సమాచారం.

## నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. ప్రభుత్వం 10 రోజులు ప్రకటిస్తే. మరో రెండు రోజులు కలిసొచ్చాయి. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరం కేలండర్ ప్రకారం దసరా సెలవులు ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు ప్రకటించారు. ఈ క్రమంలో, ఈనెల 10న రెండో శనివారం, మరుసటిరోజు ఆదివారం కావడంతో రెండురోజులు ముందే సెలవులు వచ్చినట్టయింది. పాఠశాలలు అక్టోబరు 22న పునఃప్రారంభం అవుతాయి.

## స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు వెళ్తాం

కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు



**నరసాపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతామని, ప్రతి పదవికి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేస్తామని మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపిల నుంచి వివిధ పదవులకు పలువురు అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అయితే మూడు పార్టీల నాయకులు పరస్పర సమన్వయంతో చర్చించి, స్థానికంగా పార్టీల బలాబలాలను పరిశీలించిన అనంతరం ఏకాభిప్రాయంతో ఒక్కో పదవికి ఒక అభ్యర్థిని ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఈ ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమన్వయ మార్గదర్శక కమిటీలో తనకు సభ్యుడిగా అవకాశం కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషి ఫలితాలు రానున్న రోజుల్లో కనిపిస్తాయని కొత్తపల్లి సుబ్బారాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లోనూ మూడు కూటమి పార్టీల నాయకులు ఐక్యంగా పనిచేసి విజయానికి కృషి చేస్తారని తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు వన్నెం రెడ్డి శ్రీనివాస్, గుగ్గిలపు మురళి తదితరులు పాల్గొన్నారు.

# 'జగన్మాత దివ్య దర్శన్' టికెట్ల ద్వారా దుర్గమ్మ భక్తులకు సులభదర్శనం

● త్వరిత దర్శనానికి సౌలభ్యం ● ఇఓ వికె శీనా నాయక్



జగన్మాత దివ్య దర్శన్ టికెట్లు ప్రారంభిస్తున్న ఇఒ

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో ఈనెల 11 నుండి జరగబోతున్న దసరా శరన్నవరాత్రుల్లో సామాన్య భక్తులు ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రవేశపెట్టిన "జగన్మాత దివ్య దర్శన్" ప్రత్యేక టిక్కెట్ల కోటాను ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ శుక్రవారం అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిక మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా అక్టోబరు 11, 12, 13 తేదీల టికెట్లు అందుబాటులో వుంటాయని, రూ.1,000 రుసుము చెల్లించిన టికెట్ హోల్డర్లకు కుమ్మరిపాలెం నుండి ఉచిత బస్సు రవాణా, ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి ముఖ మండప (బంగారు వాకిలి) దర్శనం దర్శనముంటుందన్నారు. మూలా నక్షత్రం రోజు మినహాయించి అన్ని రోజులకు విడతల వారీగా దర్శనం టిక్కెట్లు విడుదల చేస్తామని ఈవో తెలిపారు. రూ.500, 300, 100 టిక్కెట్లు రద్దు చేసి ఉదయం 4 నుండి రాత్రి 11 వరకు 4 క్యూ లైన్ల ద్వారా అందరికి ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్లు, స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు ఉదయం 6 నుండి 8 వరకు, మళ్ళీ రాత్రి 7.45 నుండి 9.45 వరకు రూ.1000/ టికెట్ దర్శనం కేవలం 4 గంటలే ఉంటుండగా, జగన్మాత దివ్యదర్శన్ ద్వారా ఏ సిఫార్సు లేకుండా సామాన్య భక్తులకు 8 గంటలపాటు రూ. 1000/ టికెట్‌పై ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసినట్లు ఇఒ తెలిపారు. అమరావతి డెవలప్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై పచ్చదనం పెంచే చర్యల్లో భాగంగా ఘాట్‌రోడ్‌లో పనులు చేపట్టారు.

### దసరా ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తించాలి: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త:** దసరా ఉత్సవాల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. దసరా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో శుక్రవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దసరా సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు రాష్ట్రం నలూమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో వస్తారని వారందరికీ సజావుగా దుర్గామాత దర్శనం జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత ఏడాది 20లక్షల మంది భక్తులు రాగా ఈసారి 25లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

ఉత్సవ విధుల్లో నియమితులయిన సెక్టార్ ఇన్‌చార్జ్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలను ముందుగానే సందర్శించి పరిస్థితులను సమీక్షించుకోవాలని సూచించారు. విధుల మార్పిడి సమయంలో ముందుగానే హాజరై బాధ్యతలు స్వీకరించాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషిచేయాలన్నారు. కమాండ్ కంట్రోల్‌రూంకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని సూచించారు.

వృద్ధులు, మహిళలు, బాలింతలు, చిన్నారులు, దివ్యాంగుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీధివ్యాపారుల వల్ల భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సిపి రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలకసంస్థ కమీషనర్ ధ్యానచంద్ర, ఆలయ ఈఓ శీనానాయక్, అదనపు సిపి సరిత, ఆర్డీఓ వెన్నెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా కలిగినీడి చిదంబరం ఎన్నిక

● రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌గా 'బాలాజీ'

● వైస్ చైర్మన్‌గా బండారు వెంకట రమణమూర్తి



**విజయవాడ (కార్పొరేషన్), అక్టోబరు 9 ప్రభాతవార్త:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఢిల్లీ) సభ్యునిగా కలిగినీడి చిదంబరం ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్న ఈయన శుక్రవారం బార్ కౌన్సిల్ ఇండియా సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌గా వై. బాలాజీ, వైస్ చైర్మన్‌గా బండారు వెంకటరమణమూర్తిలు ఎన్నికయ్యారు. శుక్రవారం హైకోర్టు ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో పై వారందరూ ఆయా పదవులకు ఎంపికయ్యారు. ఎంపికైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు చిదంబరం, చైర్మన్ బాలాజీ, వైస్ చైర్మన్ వెంకట రమణమూర్తిలను పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు అభినందించారు.

## ఓవి రమణకు విజయసాయిరెడ్డి ఆహ్వానం



**తిరుపతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను ఏర్పాటుచేస్తున్న రాజకీయపార్టీతో కలిసి రావాలని తిరుపతికి చెందిన ఓవి రమణకు మాజీ ఎంపి విజయసాయిరెడ్డి బహిరంగ ఆహ్వానం పలికారు. గతంలో టిటిడి బోర్డులో ఇద్దరూ కలిసి పనిచేశామని వెల్లడించారు. త్వరలో ప్రారంభించనున్న పార్టీలోకి తన మిత్రుడు, టిటిడి మాజీ సభ్యుడు ఓవి రమణను ఆహ్వానించడం విశేషం. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని విజయసాయిరెడ్డి దర్శించుకున్నారు. కొత్త పార్టీ ప్రారంభించబోతున్న సందర్భంగా స్వామివారి ఆశీస్సులు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో తాను, ఓవి రమణ నాలుగేళ్ల పాటు టిటిడి బోర్డు సభ్యులుగా కలిసి పనిచేశామని గుర్తుచేశారు. ఇప్పుడు తన కొత్త పార్టీలోనూ ఇద్దరం కలిసి పనిచేసి విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అసలైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని పునర్నిర్మించాలని విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఎఇఇ నియామక ప్రక్రియ నిబంధనల్లో సవరణ

**తిరుపతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఎఇఇ పోస్టుల భర్తీకి సంబంధించిన నిబంధనల్లో స్వల్ప మార్పు చేసినట్లు ఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డి) సిహెచ్ రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకరు గానీ అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఒకే ర్యాంకును పొందిన సందర్భాల్లో పుట్టిన తేదీలు కూడా ఒకే విధంగా ఉండడం తదితర అంశాలకు సంబంధించి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసినట్లు తెలిపారు. ఈ సవరణకు సంబంధించిన అంశాలను ఏపీ విద్యుత్ నియామక పోర్టల్ ఎపివిద్యుత్ రిక్రూర్‌మెంట్. ఎపిసిఎఫ్ ఎస్ఎస్. ఇన్ లోనూ, అదేవిధంగా ఎపిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. ఎపిఎస్‌పిడిసిఎల్. ఇన్‌లోనూ పొందుపరచడం జరిగిందని తెలియ జేశారు. ఈ వెబ్‌సైట్లను సందర్శించడం ద్వారా సవరించిన నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను అభ్యర్థులు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## రీసర్వే ప్రక్రియపై జెసిలు ప్రతి రోజు సమీక్షించాలి

● సిఎస్ జి.సాయిప్రసాద్

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో భూములు రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రగతిలో వెనుకబడిన మండలాల అధికారులతో జాయింట్ కలెక్టర్లు ప్రతి రోజు, జిల్లా కలెక్టర్లు వారానికి ఒకసారి టెలికాన్ఫరెన్స్ లేదా వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఎపి సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియ వివిధ దశల్లో ఉందని ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, వివిధ అధికారులు పాల్గొన్నారు.

## ఉండ్రాజవరం మండలంలో పెద్దపులి సంచారం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. పసలపూడి, కలదారి గ్రామాల మధ్య ఉన్న పంట పొలాల్లో పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కెమెరాల ద్వారా పులి కదలికలను గుర్తించిన అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో పరిసర గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. పసలపూడి, కలదారి, సూర్యారావుపాలెం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు ఒంటరిగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్దపులి కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికా రుల సమన్వయంతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పులి కదలికలను గుర్తిస్తూ, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. పులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందకుండా, అధికారుల సూచనలు పాటించాలని సంబంధిత శాఖల అధికారులు కోరుతున్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.27/VMC/CDB/2026-27, Dt.09-10-2026
Providing CC patch works, Paintings & Repairs, Dasara Festival works, Toilets works, Request for proposal for Operation & Maintenance of CT, PT and Namma Toilets (Total 79 works)-Est.Amount Rs.769.27 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen@ www.tender.apeprocurement.gov.in.
Sd/-Commissioner

10-10Pg7exHMNWJQE.qxd OK:10-10Pg7exHMNWJQE.qxd 1/1/02 8:50 AM Page 1



# ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యం

## : డెమోక్రసీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. అబ్బయ్య

విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:ప్రజాస్వామ్య విలువలు పతనమవుతున్న నేపథ్యంలో వాటిని కాపాడి, మెరుగైన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని ఏపీ డెమోక్రసీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. అబ్బయ్య అన్నారు.ఏపీ డెమోక్రసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అబ్బయ్య మాట్లాడుతూ శాసన వ్యవస్థ (లెజిస్లేచర్), కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్), న్యాయ వ్యవస్థ (జుడిషియరీ), మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగు ప్రధాన స్తంభాలని వివరించారు.మీడియాపై ప్రజల ఆశలు మిగతా మూడు వ్యవస్థల నుంచి ఆశించిన ఫలితాలు అందనప్పుడు ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మీడియా కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు.డెమోక్రసీ ఫౌండేషన్ పరిచయం ఇది ఒక సివిల్ సొసైటీ సంస్థగా, థింక్ ట్యాంక్‌గా పనిచేస్తూ పరిశోధన, కొత్త ఆలోచనల ద్వారా మెరుగైన ప్రజాస్వామ్య నిర్మాణానికి కృషి చేస్తుందని తెలిపారు.ఓటర్లకు అవగాహన కల్పించడం, ఎన్నికల సంస్కరణలు, రాజకీయ సంస్కరణలు, క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, యువత మరియు విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం వంటి 18 పరిష్కారాలను ప్రతిపాదించారు.సామాజిక విప్లవం ఆవశ్యకత: ప్రజాస్వామ్యంలో సమూల మార్పులు తీసుకురావడానికి సామాజిక మార్పులు, ప్రజల్లో చైతన్యం అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థలో సానుకూల మార్పులు తీసుకురావడంపై ఫౌండేషన్ దృష్టి సారిస్తోందని తెలిపారు. యువతలోని శక్తి,లోచనలను సరైన విధంగా ప్రోత్సహించి, మార్గనిర్దేశం చేయకపోతే అవి దారి తప్పే అవకాశం ఉందని, సమాజంలోని వ్యక్తులకు ఉన్న విజ్ఞానం, మంచి ఆలోచనలు వేర్వేరుగా ఉండిపోకుండా అందరూ కలిసి పనిచేస్తే మెరుగైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని అన్నారు.



నెల్లూరు, అక్టోబరు 9, ప్రభాతవార్త - వైద్యం : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ఏసీ నగర్‌లో ఉన్న మల్లెల సంజీవయ్య ప్రభుత్వ హైస్కూల్‌ను రూ.9.69 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించేందుకు జిగ్మా కంపెనీ ముందుకొచ్చిందని వెల్లడించారు. శుక్రవారం తన

# ఎసి నగర్ ప్రభుత్వపాఠశాలకు కార్పొరేట్ హంగులు

## - రూ.9.69 కోట్ల సిఎస్ఆర్ నిధులతో ఆధునీకరణ - శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

కుమార్తె పొంగూరు షరణితో కలిసి పాఠశాల ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పాఠశాలకు చేరుకున్న మంత్రి నారాయణకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. విద్యా ప్రదాతకు పూలవర్షంతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నూతన విద్యాకమిటీ సభ్యులను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో తిరిగి ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, పేద విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మంత్రి కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ తన తండ్రి స్టాటిస్టిక్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అని, విద్యకు ఆయన ఎంత ప్రాధాన్యమిస్తారో అందరికీ తెలుసన్నారు. తాను చిన్నతనంలో అనుభవించిన పేదరికం, కష్టాలు పేద విద్యార్థులకు ఎదురుకాకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, ఖగోళశాస్త్రంపై అవగాహన పెంచేందుకు ఆస్ట్రో ల్యాబ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. :జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు మాట్లాడుతూ నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని మంత్రి నారాయణ సంకల్పించారని తెలిపారు. ఆయన ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నారని, తద్వారా పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి నారాయణ వైకుంతపురంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. సదుపాయాలను సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వాతావరణం, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ తిరుపాల్, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధి శంకర్ నారాయణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్,

కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి పాల్గొన్నారు.

# అటవీ హక్కుల చట్టం అమలులో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ విధానాలకు ప్రశంసలు

## - కోల్‌కతా రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఏపి ప్రజెంటేషన్‌కు ప్రతినిధుల అభినందనలు



రీజనల్ కాన్ఫరెన్స్ ఆన్ బెస్ట్ ప్రాక్టీసెస్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ యాక్ట్‌లో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్. భార్గవి

విజయవాడ,అక్టోబరు 9,ప్రభాత వార్తప్రతినిధి: అటవీ హక్కుల చట్టం, 2006 అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి. కోల్‌కతాలో నిర్వహించిన రీజనల్ కాన్ఫరెన్స్ ఆన్ బెస్ట్ ప్రాక్టీసెస్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ యాక్ట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున అటవీ హక్కుల చట్టం అమలులో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలను గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు,ఎస్. భార్గవి ఆంధ్రప్రదేశ్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ ప్రజెంటేషన్‌కు సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి.అటవీ హక్కుల చట్టం అమలులో ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడం, విజయవంతమైన కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించేలా ప్రోత్సహించడం ఈ ప్రాంతీయ సమావేశాల ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో భాగంగా తొలుత దక్షిణాది రాష్ట్రాలతో మొదటి రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించగా, అనంతరం ఉత్తరాది రాష్ట్రాలతో రెండవ రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అటవీ హక్కుల చట్టం అమలులో అనుసరిస్తున్న విధానాలకు గుర్తింపు లభించింది.ముఖ్యంగా అటవీ హక్కులకు సంబంధించిన రికార్డులను గిరిభూమి.. పోర్టల్ ద్వారా డిజిటల్ విధానంలో రెవెన్యూ శాఖ ..మీభూమి.. పోర్టల్‌తో, బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానం చేయడం, అటవీ హక్కుల లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయినటువంటి ..పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ.. మొదలగు ప్రయోజనాలు అందేలా వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించడం, సామాజిక అటవీ వనరుల హక్కుల గుర్తింపు, గిరిజనుల జీవనోపాధుల అభివృద్ధి, అటవీ ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవగలవని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుసరిస్తున్న ఈ ఉత్తమ విధానాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగకరంగా ఉంటాయని గుర్తించిన నేపథ్యంలో, ప్రస్తుత కోల్‌కతా రీజనల్ కాన్ఫరెన్స్‌లో వాటిని ఇతర రాష్ట్రాల ప్రతినిధులతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ను కోరడం జరిగింది. ఈ మేరకు ఎస్. భార్గవి, రాష్ట్రంలో అమలవుతున్న ముఖ్యమైన కార్యక్రమాలు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ పథకాల సమన్వయం, సామాజిక అటవీ హక్కులు మరియు గిరిజనుల జీవనోపాధుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు.ఆంధ్రప్రదేశ్ అనుభవాలు, అమలు విధానాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలవడంతో పాటు, అటవీ హక్కుల చట్టం లక్ష్యాలను మరింత సమర్థవంతంగా సాధించేందుకు దోహదపడతాయని సమావేశ ప్రతినిధులు ప్రశంసించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుంది.

### రతన్ టాటా వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన వైఎస్సార్‌సిపి అధినేత జగన్

విజయవాడ,అక్టోబరు 9,ప్రభాత వార్తప్రతినిధి: దివంగత వ్యాపార దిగ్గజం రతన్ టాటాకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నివాళులు అర్పించారు. రతన్ టాటా విలువలు, సేవలు, మానవతా దృక్పథం తరతరాలకు స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..వినయం, సేవాభావం, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం రతన్ టాటా జీవితం. భారత పారిశ్రామిక రంగానికి కొత్త దిశానిర్దేశం చేసిన మహనీయుడు రతన్ టాటా అన్నారు.వ్యాపార విజయాలతో పాటు, సామాజిక సేవకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది. రతన్ టాటా విలువలు, సేవలు, మానవతా దృక్పథం తరతరాలకు స్ఫూర్తిదాయకం. రతన్ టాటా గారి వర్ధంతి సందర్భంగా ఆయన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అని పోస్టు చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ కమిటీలు

విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ కమిటీలు ఏర్పాటు చేసింది. ఐదు అడ్‌హాక్ కమిటీలు ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. కూటమితో సమన్వయానికి మనోహర్, హరిప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్‌తో కమిటీ ఏర్పాటు చేశారు. మరో ఐదుగురితో ఎన్నికల నిర్వహణ మార్గదర్శక కమిటీని, ఐదుగురితో స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. మంత్రి దుర్గేష్ నేతృత్వంలో ఐదుగురితో ప్రచార కమిటీ, ఐదుగురితో ట్రెజరీ కమిటీ ఏర్పాటు చేశారు.



# యాకర్లపాడు వద్ద ఘోర రోడ్డుప్రమాదం - ఇద్దరు మృతి

అనంతసాగరం (నెల్లూరు), అక్టోబర్ 9, ప్రభాతవార్త : అనంతసాగరం మండలం యాకర్లపాడు సమీపంలో శుక్రవారం జాతీయరహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తిరుమల నుంచి శ్రీశైలం వైపు వెళుతున్న ఎంజికారు ముందు టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఒక మహిళ, ఒక వ్యక్తి మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న అనంతసాగరం ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టంనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూరినత వివరాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

# చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు : లక్ష్మీ పార్వతి

విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి: చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీ పార్వతి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, ప్రచారాలు, రాజకీయ నాటకాలేనని.. చేసిందే మళ్లీ మళ్లీ చేస్తూ.. చెప్పిందే పదే పదే చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే పెన్షన్ పథకాన్ని 22 సార్లు ప్రారంభించడం చంద్రబాబు ప్రచార పిచ్చికి నిదర్శనం. కొత్తగా ఒక్క పెన్షన్ అయినా మంజూరు చేశారా?. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశారా?. స్థానిక ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసమే 34 శాతం రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు కొత్త నాటకం. న్యాయస్థానాల్లో నిలబడని బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కూడా వైఎస్ జగన్‌కు ఆపాదించడం దుర్మార్గం. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయంగా సామాజికంగా పెద్దపీట వేసింది వైఎస్ జగన్ అని లక్ష్మీ పార్వతి పేర్కొన్నారు.భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో వైఎస్ జగన్ చేసిన కృషిని చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారు. వైఎస్ జగన్ హయాంలో చేపట్టిన పనులకు పేర్లు మార్చి చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. వైఎస్ జగన్ హయాంలో రూపొందించిన పట్టాదారు పాసు పుస్తకాలనే చంద్రబాబు ఐదుసార్లు పంపిణీ పేరుతో ప్రచారం చేస్తున్నారు. పాసు పుస్తకాలపై వైఎస్ జగన్ ఫొటో ఉందని దుష్ప్రచారం చేసినవాళ్లే ఇప్పుడు వాటిని పంపిణీ చేస్తున్నారు..రాయలసీమలో కరువు విలయ తాండవం చేస్తుంటే చంద్రబాబుకు ప్రచారం చేసుకుంటున్నారు. రాయలసీమలో పంటలు ఎండిపోతుంటే రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. రాయలసీమకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నామంటున్న చంద్రబాబు.. బడ్జెట్‌లో ఎంత కేటాయించారో చెప్పాలి. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాయలసీమకు ఏం చేశారో సమాధానం చెప్పాలి.

# అసోం నృత్య కళాకారిణి అనుమానాస్పద మృతిపై సిఎం చంద్రబాబుకు ఆ రాష్ట్ర సిఎం లేఖ

విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి: యువతి మృతిపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. అసోం యువతి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పొందూరు రైల్వేస్టేషన్ల మధ్య బొడ్డేపల్లి పేట వద్ద శవమై కనిపించింది.ఈ ఘటన దేశవ్యాప్త ఆందోళగా మారింది.అస్సాంలో విద్యార్థి,యువజన సంఘాలు ఆందోళన చేస్తున్నారు.ఈ క్రమంలో అసోం ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖలో "హిమశ్రీ బోడో విషాదకర మరణం మాకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఈ రోజు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.ఏపీలో ఉన్న చట్టాల అమలు, సంస్థలతో సమన్వయం చేసుకోవడానికి అస్సాంకు చెందిన ఒక సీనియర్ పోలీసు అధికారిని ఆంధ్రప్రదేశ్‌కు పంపాను" అని హిమంత బిస్వా లేఖలో పేర్కొన్నారు. యువతి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసపొందూరు రైల్వేస్టేషన్ల మధ్య బొడ్డేపల్లి పేట వద్ద శవమై కనిపించిన ఘటన కలకలం రేపింది. అసోం రాష్ట్రం గువాహటిలోని బోండా ప్రాంతానికి చెందిన హిమశ్రీ బోరో(20) ఓ నృత్య ప్రదర్శన కోసం అసోం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. ఆమె రైలు పట్టాల వద్ద శవమై తేలింది. అర్ధరాత్రి రైలులో ప్రయాణిస్తున్న సమయంలో నా చుట్టూ చాలా మంది మగవాళ్లు ఉన్నారు. కొందరు మద్యం తాగుతున్నారు, భయంగా ఉందిఖి అని యువతి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడింది. యువతికి తల్లిదండ్రులు ధైర్యం చెప్పి, కొద్ది సేపటికి తిరిగి ఫోన్ చేయగా ఎటువంటి స్పందన లేదు. అంతలోనే ఉదయం రైలు పట్టాలపై యువతి శవమై కనిపించింది. అసలు ఆ రాత్రి ట్రైన్‌లో ఏం జరిగింది? ఆమెను ఎవరైనా వేధించారా? హత్య చేసి రైలు పైనుంచి తోసేశారా? లేదా జారి పడి మృతి చెందిందా? అనే కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ.. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. స్వస్థలానికి వెళ్లేందుకు రైలెక్కిన అసోం విశాఖలో నృత్య పోటీల్లో పాల్గొనేందుకు వచ్చింది. స్నేహితులంతా అక్కడే ఉండిపోగా ఆమె మాత్రం మరుసటి రోజు పరీక్ష ఉందని ఈ నెల 6న విశాఖ నుంచి బయల్దేరింది. అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో కన్యాకుమారిదిబ్రూగఢ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. కోచ్ నంబరు ఎస్2లో ప్రయాణిస్తున్న ఆమె 1 గంట సమయంలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడింది. కొందరు మద్యం తాగుతున్నారని, భయంగా ఉందని చెప్పింది. రాత్రి 2.30 గంటల తరువాత కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేసింది.

# ఎమ్మెల్యే బాలరాజుపై జనసేన అధిష్ఠానం విచారణ!

### ఆరోపణలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

కొయ్యలగూడెం, అక్టోబర్09, (ప్రభాతవార్త) పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వ్యవహారశైలిపై జనసేన పార్టీ అధిష్ఠానం స్పందించింది. ఆయనపై వస్తున్న ఇసుక, మట్టి తవ్వకాలు, వాటాల పంపిణీ, సెటిల్మెంట్ల ఆరోపణలు, వీడియోల లీక్ వివాదాలపై విచారణ జరిపేందుకు పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉన్నతస్థాయి కమిటీని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. రిజనుల సేవపై దృష్టి పెట్టాలని సూచన తంలోనే ఎమ్మెల్యే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని, పారదర్శకంగా ప్రజలకు సేవలందించాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ ఆయన వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు, వివాదాల నేపథ్యంలో అధిష్ఠానం విచారణకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన వీడియోలు, ఇసుక, మట్టి తవ్వకాలకు సంబంధించిన ఆరోపణలు, కూటమి పార్టీల మధ్య తలెత్తిన విభేదాలపై కమిటీ పరిశీలన జరపనుంది. విచారణ పూర్తయిన అనంతరం కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా ఎమ్మెల్యేపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ కేంద్ర కార్యాలయం స్పష్టం చేసినట్లు సమాచారం.

కమిటీ విచారణ, దాని నివేదికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఆర్టీజిఎస్ పనితీరు ఆదర్శప్రాయం

## - రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్

అమరావతి,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి: రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ పనితీరు, ఈ సంస్థ చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యకలాపాలు ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్ అభినందించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ ఆయనకు స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరు, దాని లక్ష్యాల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ చేపడుతున్న డేటాలేక్, అవేర్, ఆర్టీజీఎస్ సీసీటీవీ360, యూనిఫైడ్ గవర్నెన్స్ డ్యాష్ బోర్డు, మనమిత్ర తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు గురించి విపులీకరించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఒక చోట అనుసంధానం చేసి ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ద్వారా విశ్లేషించి పాలనను మరింత సరళీకృతం చేయడానికి దోహదపడే పలు రకాల యూస్ కేసెస్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు సంక్లిష్టంగా కాకుండా సరళంగా మారి, ఎలాంటి అంతరాయాలు లేకుండా పౌరులకు సేవలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు. అవేర్ విభాగం ద్వారా నిరంతరం వాతావరణ పరిస్థితులను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామన్నారు. దీనిద్వారా ముందస్తుగానే వాతావరణ మార్పులను పసిగట్టి విపత్తుల నుంచి ప్రజలను, యంత్రాంగాన్ని ముందస్తుగానే అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వరదలు, తుఫాన్ లాంటి విపత్తుల సమయంలో అవేర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక విశ్లేషణల ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టాల తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగేలా ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో నీటి లభ్యత కూడా రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. సీసీఎల్ ఏ జాయింట్ సెక్రటరీ టీ.ఎస్. చేతన్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నారాయణ్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న కార్యకలాపాలను కొనియాడారు. ప్రధానంగా డేటాలేక్ ప్రాజెక్టును ఆయన ఆసక్తిగా తిలకించారు. డేటాలేక్ లాంటి ప్రాజెక్టు అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సెన్సెన్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ జె. నివాస్, ఆర్టీజీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంటు పి. శ్రీఖర్ పాల్గొన్నారు.



ఆర్టీజీఎస్ గురించి వివరాలు తెలుసుకుంటున్న రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్

# స్థానిక సంస్థల ఎన్నికలకు కేంద్ర బలగాలను మోహరించాలి

## - వైఎస్సార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

విజయవాడ,అక్టోబరు9,ప్రభాతవార్తప్రతినిధి:ఆంధ్రప్రదేశ్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కేంద్ర బలగాలను మోహరించాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ అభ్యర్థులకు తగినంత భద్రత ఇవ్వాలని, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను జిల్లా కేంద్రాల్లో సమర్పించేందుకు అవకాశం కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. అలాగే వీటి కాపీల్ని కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా పంపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.కేంద్ర సాయుధ పోలీసు బలగాలను తగిన సంఖ్యలో మోహరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. కేంద్ర బలగాల మోహరింపు ఎన్నికల సంఘం సమర్థవంతమైన పర్యవేక్షణలో జరగాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై రాజకీయ బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల భద్రత బాధ్యతలను పూర్తిగా రాష్ట్ర పోలీసులకు అప్పగిస్తే నిష్పక్షపాత వాతావరణం ఉంటుందన్న నమ్మకం తమకు లేదన్నారు. కూటమి పాలనలో ప్రతిపక్ష అభ్యర్థులు బెదిరింపులు, దాడులు, రాజకీయ ప్రేరేపిత పోలీసు చర్యలు, రాజకీయ కార్యకలాపాలకు అడ్డంకులు ఎదుర్కొంటున్నారని లేఖలో వెల్లడించారు. ఈ పరిస్థితులు ఎన్నికల సమయంలో మరింత తీవ్రమై, ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేయడం, ప్రచారాన్ని నిరోధించడం వంటి పరిణామాలకు దారి తీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క పోలింగ్ రోజు మాత్రమే భద్రత కల్పించడం సరిపోదని, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందే కేంద్ర బలగాలను మోహరించి, ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు ప్రకటించే వరకు కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, ప్రతిపాదకులు, మద్దతుదారులపై ఒత్తిళ్లు తీసుకురావడం ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతుందని లేళ్ల అప్పిరెడ్డి లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాలు, వార్డుల వంటి సన్నిహిత సమాజాల్లో బెదిరింపులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిపక్ష అభ్యర్థులు, కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు తమ చట్టబద్ధమైన ఎన్నికల బాధ్యతలను నిర్వహించకుండా పోలీసు అధికారాలను ఉపయోగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్నికల్లో ఎవరు పాల్గొనాలి, ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే అంశాలను అధికార పార్టీ ప్రభావం లేదా ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగం నిర్ణయించకూడదని పేర్కొన్నారు.

# శ్రీవారి కైంకర్యాలకు టిటిడి గోశాల నుండే పాలు

## - గోశాలలో ఏర్పాట్ల పరిశీలనలో అదనపు ఇఒ చౌదరి



తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల గోశాలలో సుమారు 100 గోవులు ఉన్నాయని, రోజుకు దాదాపు 90 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయని టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి తెలిపారు. శ్రీవారి కైంకర్యాలకు గోశాల నుండి సేకరించిన పాలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రతిరోజూ నిర్వహించే నవనీత సేవకు అవసరమైన సుమారు 1.5 కిలోల వెన్నను కూడా గోశాల నుండే సమకూర్చుతున్నట్లు వివరించారు. నవనీత సేవకు సంబంధించిన ఊరేగింపు కూడా గోశాల నుంచే ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి టిటిడి చేపడుతున్న ఏర్పాట్లలో భాగంగా వెంకయ్య చౌదరి గోశాలను శుక్రవారం సాయంత్రం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గోశాలలోని గోవుల సంరక్షణ, పశువుల ఆరోగ్య పరిస్థితులు, పాల ఉత్పత్తి సామర్థ్యం, పశుగ్రాసం నిల్వలు, ఇతర అవసరాలపై అధికారులతో సమీక్షించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల్లో పాల్గొనే ఏనుగులు, గుర్రాలు, ఎద్దుల సంరక్షణ, వాటి ఆరోగ్య పరిస్థితులు, ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ, సన్నద్ధతను కూడా పరిశీలించారు.జంతువుల సంరక్షణలో సిబ్బందికి ఉన్న అనుభవాన్ని, వాటి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. జంతువులకు అవసరమైన వైద్య సదుపాయాలు, వెటర్నరీ నిపుణుల సేవలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

# తిరుపతిలో విద్యుత్ షాక్‌తో ఇద్దరు భవన కార్మికులు మృతి

తిరుపతి,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి నగరంలో నిర్మాణంలో ఉన్న భవనంపై విద్యుత్‌షాక్‌కు గురై ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన తిరుపతి నగరంలోని తూర్పుపోలీస్ స్టేషన్ పరిధిలో తాతా నగర్ లో జరిగింది. తాత నగర్ లో సుందర మూర్తి నిర్మిస్తున్న రెండు అంతస్తుల భవనంపై కాంక్రీట్ మిషన్ తో పై అంతస్తుకు ఇనుప తొట్టి చేరవేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాంక్రీట్ తొట్టి విద్యుత్ పోల్స్ కు అమర్చిన తీగల తగలడంతో విద్యుత్‌షాక్‌కు ఇద్దరు గురయ్యారు. ఇరువురిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతులు రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన లీలా కుమార్(24),రాజమండ్రి కి చెందిన వలస కూలి లోవరాజు (40) .కుటుంబసభ్యులు బోరున విలపించారు. ఈస్ట్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు. ఆస్తి కోసం తల్లిపై దాడి ఇదిలా ఉండగా తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగి పట్టెడలో ఆస్తి కోసం తల్లిపై కుమారుడు, కోడలు దాడి చేశారు. శాంతమ్మ భర్త పేరున ఉన్న 13 అంకణాల స్థలాన్ని రాసివ్వాలంటూ పెద్ద కొడుకు చంద్రశేఖర్ కోడలు ఈశ్వరమ్మ చిన్న కొడుకు రావణ కుమార్ లతో కలసి తల్లిని హింసించారు. విసుగు చెందిన తల్లి శాంతమ్మ ఈస్ట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేసింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



# శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలతో అలిపిరిలో ఆర్టీసి బస్సుల తనిఖీ

తిరుమల, అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందుగానే ఆర్టీసి అధికారులు అలిపిరిలో బస్సుల సామర్థ్యం తనిఖీ చేపట్టారు. భక్తులకు సురక్షితమైన, నమ్మకమైన ఎలాంటి ఆటంకాలు లేని రవాణా సేవలను అందించడమే లక్ష్యంగా ఆర్టీసి యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. శుక్రవారం అలిపిరిలోని బి.బి.ఎస్. (బ్రహ్మోత్సవం బేస్ క్యాంప్) ను జిల్లా ప్రజారవాణా అధికారి (డి.పి.టి.ఓ.) కే శ్రీనివాసరావు ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఆర్టీసి బస్సుల ప్రత్యేక తనిఖీ ప్రక్రియను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీ ,సూళ్లూరుపేట డిపో మేనేజర్ కళ బేస్ క్యాంప్‌లో ఇప్పటివరకు నమోదైన వాహన లోపాలు తనిఖీ పురోగతిని డి.పి.టి.ఒకి వివరించారు. ఈ సందర్భంగా క్యాంప్ సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జ్‌లతో కలిసి ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల వేళ ఘాట్ రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనం అత్యంత సురక్షితంగా ఉండాలని సాంకేతిక విభాగానికి డి.పి.టి.ఒ.

స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వాహనాల తనిఖీల్లో ఎలాంటి అజాగ్రత్త వహించరాదని, ముఖ్యంగా భద్రతా అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.

10-10Pg5.qxd:10-10Pg5.qxd 1/1/02 7:12 AM Page 1



# ఉప ఎన్నికల్లో ఎవరి సీట్లు వారికే

## ఆయా రాష్ట్రాల్లో పట్టు నిలుపుకున్న అధికార పార్టీలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీలు సత్తా చాటాయి. బెంగాల్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ విజయం సాధించగా, తమిళనాడులో టీవీకే పార్టీ హవా కొనసాగింది. అస్సాంలో ఓ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కమలం విజయభేరి మోగించింది. పుదుచ్చేరి ఉపఎన్నికలో బీజేపీ మిత్రపక్షం ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. బెంగాల్, అస్సాంలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలను కమలదళం సొంతం చేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ 1.22 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌పై గెలిచారు. ముస్లింలు అత్యధికంగా ఉండే రెజినగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి శంభునాథ్ సర్కార్ 72 వేల ఓట్లకుపైగా తేడాతో ఎజెయుపి అభ్యర్థి గులాం నబీ ఆజాద్‌పై గెలిచారు. ఈ ఫలితాలపై స్పందించిన సీఎం సువేందు అధికారి, బెంగాల్‌లోని మైనార్టీ వర్గాలు బీజేపీకి అండగా నిలిచాయని, అందుకే తమ ప్రభుత్వానికి మద్దతుగా పెద్ద సంఖ్యలో ఓట్లు వేశారన్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు బెంగాల్ రాజకీయ దృక్పథంలో వచ్చిన పెను మార్పులకు నిదర్శనమని పేర్కొన్నారు. మైనార్టీ ఓటు బ్యాంకుపై తమదే గుత్తాధిపత్యం అని భావించిన పార్టీలకు నందిగ్రామ్, రెజినగర్ ఫలితాలు గట్టి సమాధానం చెప్పాయని వెల్లడించారు. అటు అస్సాంలో నగావ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి దేవాకే శర్మ లక్షా 64 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. తమిళనాడు అసెంబ్లీ ఉపఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ హవా తమిళనాడు ఉపఎన్నికల్లో అధికార టీవీకే పార్టీ తమ హవా కొనసాగించింది. మదురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. ధారాపురంలో 9 వేలకు పైగా ఓట్ల తేడాతో టీవీకే అభ్యర్థి సత్యభామ విజయం సాధించారు. మధురాంతకంలో 15 వేలకు పైగా ఓట్ల తేడాతో డీఎంకే అభ్యర్థి పరంతమన్‌పై టీవీకే అభ్యర్థి మరకతం గెలుపొందారు. తమిళనాడు ఉప ఎన్నికల ఫలితాలపై స్పందించిన విజయ్, టీవీకే పార్టీ పట్ల ప్రజలకు ఉన్న అభిమానం, ప్రజాస్వామ్యం పట్ల ఉన్న నిబద్ధతను ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. ఈ విజయం మహిళలను కించపరిచే నేతలకు, వెన్నుపోటు రాజకీయాలకు ప్రజలిచ్చిన బలమైన తీర్పు అని అభివర్ణించారు. ఈ గెలుపు తమపై ఉన్న బాధ్యతను మరింత పెంచిందని విజయ్ వెల్లడించారు. మరోవైపు, ఉప ఎన్నికల ఫలితాలపై మాట్లాడిన డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్, టీవీకే పార్టీ సాధించిన విజయం ప్రజల మనోభావాలకు అద్దం పట్టేది కాదని, స్వార్థ రాజకీయాలు, నమ్మక ద్రోహంతో సాధించిన తాత్కాలిక గెలుపు మాత్రమేనని వెల్లడించారు. నిజమైన ప్రజా స్వామ్య పోరాటంలో ఇటువంటి అక్రమ విజయాలు ఎప్పటికీ నిలబడవని స్పష్టం చేశారు. 8వేలకు పైగా ఓట్ల తేడాతో పుదుచ్చేరి ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి విజయం పుదుచ్చేరి ఉపఎన్నికలో ఎన్డీయే మిత్రపక్షమైన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరోసారి విజయఢంకా మోగించింది. సీఎం రంగస్వామి కంచుకోటైన తట్టంచావడి స్థానానికి జరిగిన ఉపఎన్నికలో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ ఆనంద్ 8 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గతంలో ఈ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ప్రాతినిధ్యం వహించగా, ఇప్పుడు అశోక్ ఆనంద్ విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఉప ఎన్నికలో అశోక్ ఆనంద్‌కు 13,358 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఈ. విజయగం 4,876 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. దీంతో ఇద్దరి మధ్య 8,482 ఓట్ల తేడా నమోదైంది.





### కేరళం మాజీ సిఎం విజయన్‌కు హైకోర్టు షాక్

## ఆయనతో పాటు కుమార్తె, అల్లుడుపై కేసు నమోదుకు ఆదేశం

**తిరువనంతపురం, అక్టోబరు 9:** కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు హైకోర్టులో షాక్ తగిలింది. లంచం ఆరోపణల సంబంధించిన కేసులో ఆయనతో పాటు కుమార్తె వీణా టీ, ఆమె భర్త, మాజీ మంత్రి పీఏ మహమ్మద్ రియాజ్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) సంస్థకు సంబంధించిన ఆరోపణపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. జస్టిస్ ఏ.బదరుద్దీన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. న్యాయవాది కేఎం షాజహాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆరోపణలపై ప్రాథమిక విచారణతో సరిపెట్టకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరిన అభ్యర్థనను అంగీకరించింది. ఈడీ నివేదిక ప్రకారం కేరళకు చెందిన సీఎంఆర్ఎల్ సంస్థ వీణా టీకి చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి రూ.2.78 కోట్లను చెల్లించింది. ఐటీ కన్సల్టెన్సీ సేవలకు చెల్లింపులుగా చూపించిన ఈ మొత్తాలు మోసపూరిత చెల్లింపులని ఈడీ ఆరోపించింది. జూన్‌లో తిరువనంతపురంలో వీణా నివసిస్తున్న అద్దె ఇంట్లో సోదాలు నిర్వహించిన ఈడీ అనంతరం ఆమెను ప్రశ్నించింది. ఆగస్టులో విడుదల చేసిన ప్రకటనలో, వీణాకు సంబంధించిన సోదాల సమయంలో దుబాయ్‌కు నిధుల బదిలీల వివరాలున్న కొన్ని చేతిరాత నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. ఈ ఆరోపణలను మహమ్మద్ రియాజ్ ఖండించారు. తనపై వచ్చిన ఆరోపణలు కల్పితమని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే చేస్తున్నారని గత నెలలో పేర్కొన్నారు. ఈడీ కేసును న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఈడీ విచారణలో వీణా ఆరోపణలను అంగీకరించారంటూ వచ్చిన వార్తలను కూడా ఆయన తోసిపుచ్చారు. అవి పూర్తిగా అబద్ధమని వ్యాఖ్యానించారు.

## సిజెపి ధర్నాలో కుటుంబమంతా పాల్గొంటున్నాం

### మాజీ సిఎం కేజ్రీవాల్ వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, అక్టోబర్ 10న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ భారీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ ఆందోళనకు తన కుటుంబంతో పాల్గొంటున్నానని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రజలు జంతర్ మంతర్ చేరుకోవాలని కేజ్రీవాల్ కోరారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశానికి సంబంధించిన అంశమని ఆయన అన్నారు. కేంద్రంపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పిస్తూ బీజేపీకి ఓటు వేయని వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించి, నకిలీ ఓట్లను చేర్చుతున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ హయాంలో ఈ వ్యవహారం జరుగుతోందని విమర్శించారు. దేశ ప్రజలు జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను కోరుతున్నారని కేజ్రీవాల్ అన్నారు. ఇదిలా ఉంటే, మరోవైపు నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు హైఅలర్ట్‌లో ఉన్నారు. ఇప్పటికే సీజేపీ నిరసనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు మెట్రో రైల్ స్టేషన్లు మూసేశారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఢిల్లీకి వచ్చే పలు రైళ్లను రద్దు చేశారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉందని పోలీసులు తె లిపారు. నిబంధనల్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

## ఉక్రెయిన్ పరిరక్షణలో మాకు అమెరికా సహకరించడం లేదు

### అధ్యక్షుడు జెలెన్‌స్కీ అసహనం

కీవ్, అక్టోబరు 9: రష్యా దాడుల నుంచి తమ దేశాన్ని కాపాడుకోవడంలో అమెరికా సహకరించడం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్ర ఆరోపణలు చేశారు. గత రెండు రోజులుగా రష్యా జరిపిన క్షిపణి, డ్రోన్ దాడుల్లో 78 మంది పౌరులు మరణించగా, మరో 215 మంది గాయపడినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల నేపథ్యంలో అమెరికా వైఖరిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కీవ్‌కు 130 కిలోమీటర్ల దూరంలోని ప్రిలుకీ పట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్‌లో రెండు బస్సులపై రష్యా జరిపిన బాంబు దాడిలో 35 మంది ప్రాణాలు కోల్పోయారని, అంతకుముందు రోజు ప్రిలుకీలోని ఓ నివాస భవనంపై దాడి చేయడంతో చిన్నారులతో సహా 22 మంది మరణించారని చెప్పారు. రాజధాని కీవ్‌లోనూ దాడులు జరగడంతో విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం ప్రతిష్టంభనలో ఉందని, పరిష్కారం కోసం అమెరికా కృషి చేస్తోందని యూఎస్ సెనేటర్ మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ మండిపడ్డారు. ప్రతిష్టంభన ఎక్కడుంది ఇది సాయం చేయకపోవడమే తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఒకవైపు రష్యాతో ఆర్థిక చర్చలు జరుపుతూ, మరోవైపు యుద్ధం ముగించాలని తమకు చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ఇరాన్‌కు అవకాశం ఇచ్చినట్లే ఉక్రెయిన్‌కు కూడా స్టార్‌లింక్ ఉపగ్రహ సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకురండి. ఆకాశాన్ని కాపాడుకోవడంలో మాకు సాయం చేయండి. అప్పుడు పుతిన్ చర్చల బల్ల వద్దకు వస్తాడని జెలెన్‌స్కీ భావోద్వేగంతో అన్నారు. తమకు మరిన్ని వాయు రక్షణ వ్యవస్థలు కావాలని, రష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో,రెండురోజులపాటు ఉక్రెయిన్ ప్రతినిధి బృందం అమెరికాలో చర్చలు జరపనుంది. రష్యాపై ఆంక్షలు పెంచాలని, ఈ చర్చల్లో ఐరోపా మిత్రదేశాలను కూడా భాగస్వాములను చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను జెలెన్‌స్కీ కోరారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందన్నారు.

## మూడేళ్ల వయసులోనే గిన్నిస్ రికార్డు



**న్యూయార్కు, అక్టోబరు 9:** చిన్నారులకు ఆటలంటే ఇష్టం బొమ్మలంటే సరదా కానీ ఈ బుడతడికి మాత్రం పుస్తకం రాయాలనే ఆలోచన వచ్చింది. తనకు ఎదురైన ఓ చిన్న అనుభవాన్నే కథగా మలిచి పుస్తకంగా ప్రచురించాడు. దీంతో మూడేళ్ల వయసులోనే ప్రపంచ రికార్డు సృష్టించాడు. అమెరికాలో నివసిస్తున్న భారత సంతతి బాలుడు అద్వయ్ జైన్ ఈ ఘనత సాధించాడు. పురుషుల విభాగంలో అత్యంత పిన్న వయసులో పుస్తకం ప్రచురించిన వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. న్యూజెర్సీలోని మన్‌మోత్ జంక్షన్‌లో 2022 ఏప్రిల్ 23న అద్వయ్ జన్మించాడు. అతడు ప్రీస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేసే సమయంలో ఎదురైన అనుభవాలే పుస్తకం రాయడానికి ప్రేరణగా నిలిచాయి. అలా రూపుదిద్దుకున్న పుస్తకానికి డైనో లెర్న్స్ నాట్ టు వేస్ట్ ఫుడ్ అని పేరు పెట్టాడు. ఆహారాన్ని వృథా చేయకూడదని నేర్చుకున్న డైనో కథ అన్నమాట. ఈ రికార్డును 2026 ఏప్రిల్ 3న న్యూజెర్సీలో అధికారికంగా ధ్రువీకరించారు. న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ వినయ శ్రీకాంత ప్రధాన్ అద్వయ్‌ను కలిసి అభినందించారు. ఈ విషయాన్ని భారత కాన్సులేట్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడించింది. చిన్న వయసులోనే పుస్తకం రాసి ప్రచురించిన అద్వయ్ ఆహారాన్ని వృథా చేయకూడదనే మంచి సందేశాన్ని చిన్నారులకు అందిస్తున్నాడని కాన్సుల్ జనరల్ ప్రశంసించారు. అద్వయ్ అక్క అవ్య కూడా రచయిత్రి, చిత్రకారిణి కావడం విశేషం. ఆమె వయసు 12 ఏళ్లు. ఇద్దరూ తమ సృజనాత్మకతతో మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎఐని 'ఎస్ఐ' అనండి

### లేకుంటే దేశద్రోహ నేరం



### ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, అక్టోబరు 9:** కృత్రిమ మేధను 'సూపర్ ఇంటెలిజెన్స్' లేక ఎస్ఐ అని పిలవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నారు. అలా పిలవని వారిని దేశ ద్రోహులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. 'ఎంతగానో ఆమోదం పొందిన సూపర్ ఇంటెలిజెన్స్‌కు బదులుగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పదాన్ని వాడేవారిని వైట్‌హౌస్ శత్రువులుగా పరిగణిస్తుంది' అని ట్రంప్ తన సోషల్ మీడియా ట్రూత్‌లో రాసుకొచ్చారు. ఎఐ పట్ల ప్రజల్లో భయం పెరుగుతుండటంతోపాటు ఈ సరికొత్త సాంకేతికతపై కఠిన నియంత్రణ అవసరమని డిమాండ్లు వినిపిస్తోన్న తరుణంలో ట్రంప్ 'సూపర్ ఇంటెలిజెన్స్' పేరును ప్రతిపాదించారు. కృత్రిమ మేధ రంగంలో తమ దేశ ఆధిపత్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో 'సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్' (ఎస్ఐఎఫ్)ను కూడా ప్రకటించారు. ఇదిలా ఉంటే.. స్పేస్ ఎక్స్ఎఐను స్పేస్ ఎక్స్ఎస్ఐగా మారుస్తారా? అని ఎలాన్ మస్క్‌కు ఇటీవల ప్రశ్న ఎదురైంది. ఆందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అవును మారుస్తామన్నారు.

## 13మందిని చంపిన హంతకుడి మరణశిక్ష ప్రత్యక్ష ప్రసారం

### అమెరికాలో తొలిసారి నిర్ణయం



**వాషింగ్టన్, అక్టోబరు 9:** అమెరికా సైనిక స్థావరం ఫోర్ట్ హుడ్‌లో 2009లో కాల్పులకు తెగబడి 13 మందిని చంపిన హంతకుడు నిడాల్ మాలిక్ హసన్‌కు డిసెంబరు 3న మరణశిక్ష అమలు చేయనున్నారు. ఫైరింగ్ స్క్వాడ్ ద్వారా ఈ శిక్షను అమలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన అధికారులు తాజాగా మరో సంచలన విషయాన్ని వెల్లడించారు. హసన్ మరణశిక్ష ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పెంటగాన్ గురువారం తెలిపింది. అమెరికాలో సైనికుడికి ఆరు దశాబ్దాలకు పైగా విరామం తర్వాత మరణశిక్ష అమలు కానుండటం, అది కూడా లైవ్‌లో చూపించనుండటం చర్చనీయాంశమైంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ బుధవారం ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ శిక్షను ప్రజలు చూసేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. దీంతో మరణశిక్షను బహిరంగంగా నిర్వహిస్తారా అనే ప్రశ్నలు తలెత్తాయి. పెంటగాన్ అధికారులు అసలు విషయం వెల్లడించారు. ఈ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేస్తామని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. హసన్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే మరణశిక్ష అమలు ఆలస్యమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. నిర్బంధం చట్టబద్ధతను పరిశీలించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేయవచ్చని పేర్కొంటున్నారు. మరోవైపు, మరణశిక్షను ప్రత్యక్ష ప్రసారం చేయడం వల్ల మరణశిక్ష అమలు ప్రక్రియపై ప్రజలకు అవగాహన పెరుగుతుందని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శిక్ష ఎదుర్కొనే వ్యక్తి గౌరవం, ఇలాంటి ప్రసారాల వెనుక ప్రభుత్వ ఉద్దేశం వంటి అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. 2009 నవంబరు 5న ఫోర్ట్ హుడ్ సైనిక స్థావరంలోని వైద్య భవనంలోకి వెళ్లిన హసన్ కాల్పులు జరిపాడు. ఆ సమయంలో అక్కడ సైనికులు వైద్య పరీక్షలు, టీకాల కోసం వేచి ఉన్నారు. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, 32 మంది గాయపడ్డారు. అప్పట్లో ఆర్మీ మేజర్‌గా పనిచేసిన హసన్ 2013లో విచారణ సందర్భంగా తానే కాల్పులు జరిపినట్లు అంగీకరించాడు. పోలీసుల కాల్పుల్లో నడుము కింది భాగం చచ్చుబడటంతో ప్రస్తుతం వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు.

## నానాపటేకర్ మృతి అసహజ మరణంగా కేసు నమోదు



**పనాజి, అక్టోబరు 9:** ప్రముఖ సీనియర్ నటుడు నానా పటేకర్ మృతికి సంబంధించి గోవా పోలీసులు అసహజ మరణం కింద మెడికోలీగల్ కేసు నమోదు చేశారు. అసలు ఆయన ఎలా చనిపోయారు మరణానికి గల సరియైన కారణాలేంటి అనే విషయాలను తెలుసుకోవడానికి ప్రస్తుతం విచారణ కొన సాగుతున్నట్లు తెలియ వచ్చింది. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసిన పోలీసులు, పనాజీకి చెందిన పీఎస్ఐ నితిన్ నాయక్‌కు ఈ విచారణ బాధ్యతలను అప్పగించారు. దోనా పౌలాలో ఓషన్ పార్క్ నుంచి నానా పటేకర్‌ను అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువచ్చే సరికి ఆయన ఇప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు కేసులో పేర్కొన్నారు. వార్త తెలిసిన వెంటనే బాంబోలిమ్‌లోని మణిపాల్ ఆస్పత్రిని సందర్శించిన పోలీసులు, అక్కడ మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. ఈ విచారణలో భాగంగా నానా పటేకర్ మరణానికి గల అసలు కారణాన్ని తెలుసుకునేందుకు పోలీసులు పోస్టుమార్టం నివే దికను పరిశీలించడంతో పాటు, కుటుంబ సభ్యులు, ఇతరుల నుంచి వాంగ్మూలాలను సేకరించ నున్నారు. ఒకవేళ ఈ విచా రణలో ఆయనది సహజ మరణ మేనని తేలితే కేసును ముగించే అవకాశం ఉంది. అలా కాకుండా ఏమైనా అనుమానాస్పద పరిస్థితులు ఉన్నట్లు తేలితే మాత్రం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీసులు సిద్ధమవు తున్నారు. మణిపాల్ ఆస్పత్రి ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శేఖర్ సాల్కర్, తమ వైద్యుల బృందం ఆయనను కాపాడటానికి శాయశక్తులా ప్రయత్నించి నప్పటికీ ఆస్పత్రికి తీసుకువచ్చే సమయానికే ఆయన కన్ను మూశారని, దాంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. ఆయనకు గుండెపోటు వచ్చిందని, అయితే దానికి గల కచ్చితమైన కారణం తెలియనప్పటికీ, అంతకుముందే ఆయన గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతూ మందులు వాడుతున్నట్లు తమకు తెలిసిందని డాక్టర్ వెల్లడించారు. అనంతరం భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోవా మెడికల్ కాలేజీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

## విదేశీ వెట్టిచాకిరీ బానిసలు అన్న జెడివాన్స్ వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** భారత ఐటీ నిపుణులను విదేశీ వెట్టిచాకిరీ బానిసలు అంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు అత్యంత అనుచితమని, భారతీయ నిపుణులను అవమానించేలా ఉన్నాయని పేర్కొంది. ఎనిమిది ప్రముఖ టెక్నాలజీ సంస్థలకు సంబంధించి పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియను అమెరికా నిలిపివేసిన నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ వేతనాలకు హెచ్1బీ వీసాదారులను నియమించుకుంటున్నారన్న ఆరోపణలతో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో సహా ఎనిమిది దిగ్గజ సంస్థలపై అమెరికా కార్మిక శాఖ ఈ చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ మాట్లాడిన జేడీ వాన్స్, కంపెనీలు స్థానిక అమెరికన్ల కంటే తక్కువ వేతనాలకు లభించే విదేశీ నిపుణులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన భారతీయ నిపుణులను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జేడీ వాన్స్ వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి పదజాలం వాడటం అనవసరం. ఇది బాధాకరమైన వలసవాద చరిత్రను గుర్తుచేస్తోంది. ఇది తీవ్రంగా అవమానపరిచే చర్యని స్పష్టం చేసింది. అమెరికాలో సేవలం దిస్తున్న భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, మేధావులని, ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వారు ఎంతో దోహదపడుతున్నారని భారత్ ఈ సందర్భంగా గుర్తు చేసింది. లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియ నిలిపివేతకు, హెచ్1బీ వీసాలకు నేరుగా సంబంధం లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రస్తుతం ఉన్న వీసాదారులపై తక్షణ ప్రభావం ఉండకపోయినప్పటికీ, ఆయా కంపెనీల్లో పనిచేసే వారి గ్రీన్ కార్డ్ దరఖాస్తులపై ప్రభావంపడే అవకాశం ఉందని వివరించింది.

## పెద్దల సభకు లతారజనీకాంత్!

### తమిళనాడులో కమలం పాగాకోసం బిజెపి ఎత్తులు



**చెన్నై, అక్టోబరు 9:** తమిళనాడు రాజకీయాలు మరోసారి అనూహ్య మలుపు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న ఆ రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ అర్ధాంగి లతా రజనీకాంత్‌ను రాజ్యసభకు పంపేందుకు రంగం సిద్ధమవుతోందన్న వార్తలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రపతి కోటాలో ఆమెను పెద్దల సభకు నామినేట్ చేసే అవకాశాలపై ఢిల్లీ స్థాయిలో విస్తృత చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో రజనీకాంత్ రాజకీయ ప్రవేశం దాదాపు ఖాయమైనట్లే కనిపించినా, అనారోగ్య కారణాలతో ఆయన చివరి నిమిషంలో ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గారు. అయితే ఇప్పుడు ఆయన అర్ధాంగి లతా రజనీకాంత్ రాజకీయాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆమె ఇటీవల ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వంటి బీజేపీ అగ్రనేతలతో సమావేశమయ్యారని, త్వరలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ భేటీ కానున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామాలతో ఆమె రాజ్యసభ ప్రవేశం దాదాపు ఖాయమనే ఊహాగానాలు బలపడుతున్నాయి.

# సంక్షిప్త వార్తలు

### నోయిడా జెవార్ ఎయిర్‌పోర్టుకు ప్రధాని మోడీ పేరు!



**లక్నో, అక్టోబరు 9:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని నరేంద్ర మోడీ అంతర్జాతీయ విమానాశ్రయంగా పిలవనున్నారు. ప్రధాని మోడీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

### జంతర్ మంతర్ నిరసనల్లో మహిళా పోలీస్‌పై లైంగిక వేధింపులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఢిల్లీలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ నిరసనల్లో మహిళా పోలీస్‌పై లైంగిక వేధింపులు జరిగాయని కేంద్ర ప్రభుత్వం తరుఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో ఆరోపించారు. పోలీసులకు గాయాలయ్యాయని, వారిని దుర్భాషలాడారని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు.

### గ్రిపెన్ యుద్ధ విమానాన్ని నడిపిన థాయ్‌లాండ్ క్వీన్ సుతిదా



**బ్యాంకాక్, అక్టోబరు 9:** థాయ్‌ల్యాండ్ క్వీన్ సుతిదా ఒంటరిగా గ్రిపెన్ యుద్ధ విమానంలో విహరించారు. తన ఏవియేషన్ కెరీర్‌లో ఆమె కొత్త మైలురాయి అందుకున్నారు. దక్షిణ థాయ్‌ల్యాండ్‌లోని సురత్‌థాయి ప్రావిన్సులో ఉన్న వింగ్ 7 ఎయిర్‌బేస్ నుంచి ఆమె యుద్ధ విమానాన్ని టేకాఫ్ చేశారు. ఈ నెల 8న విహరించినట్లు స్థానిక మీడియా తెలిపింది. సింగిల్ సీట్ జెఎఎస్ 39సి గ్రిపిన్ విమానాన్ని తొలిసారి ఒంటరిగా క్వీన్ సుతిదా నడిపారు. థాయ్ చక్రవర్తి మహా వజిరలంకోర్న్ ఈ ఘటన వేళ అక్కడే ఉన్నారు. యుద్ధ విమానంలో విహరించిన క్వీన్‌కు బోకేను అందజేశారు.

### జెఎన్‌యు ప్రొఫెసర్ అంగోంచా బిమోల్ అకోయిజమ్ సస్పెన్షన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** కాంగ్రెస్ ఎంపీ, జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ అంగోం చా బిమోల్ అకోయిజమ్‌పై వేటు పడింది. లైంగిక వేధింపుల ఆరోపణలపై నిర్వహించిన విచారణ అనంతరం ఆయనను ఉద్యోగం నుంచి తక్షణమే తొలగిస్తూ యూనివర్సిటీ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ విషయాన్ని వెల్లడించింది. జెఎన్‌యువైస్ ఛాన్సలర్ శాంతిశ్రీ డి. పండిట్ సంతకం చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం యూనివర్సిటీలోని అంతర్గత కమిటీ లైంగిక ఆరోపణలపై విచారణ చేపట్టింది. విచారణ అనంతరం అకోయిజమ్‌పై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది.

### తట్టంచావిడిలో రెట్టింపు మెజారిటీతో అశోక్ గెలుపు



**పుదుచ్చేరి, అక్టోబరు 9:** పుదుచ్చేరిలోని తట్టాంచావడి అసెంబ్లీ ఉప ఎన్నికలో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ ఆనంద్ ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఈ. వినయగంపై 8,482 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంతో అధికార ఎఐఎన్నార్సీ తన పట్టును మరోసారి చాటుకుంది. గతంలో ఈ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ప్రాతినిధ్యం వహించగా, ఇప్పుడు అశోక్ ఆనంద్ విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### దిగుమతి బంగారంపై ఐజిఎస్టీ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** బంగారం, వెండి కొనాలనుకునేవారికి కీలక సమాచారం. 2027 ఏప్రిల్ 1 నుంచి బ్యాంకులు, ప్రభుత్వం గుర్తించిన సంస్థల ద్వారా దిగుమతి చేసుకునే బంగారం, వెండి, ప్లాటినంపై 3 శాతం ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వర్తించనుంది. ఇప్పటివరకు కొన్ని బ్యాంకులు, గుర్తింపు పొందిన సంస్థలకు ఉన్న పన్ను మినహాయింపులను కేంద్ర ప్రభుత్వం పొడిగించకూడదని నిర్ణయించింది. రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ గురువారం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. పన్ను మినహాయింపులు 2027 మార్చి 31తో ముగియనున్నాయి. ఆ తర్వాత అర్హత కలిగిన దిగుమతులపై 3 శాతం ఐజీఎస్టీ అమల్లోకి వస్తుంది.

10-10Pg6exHMNWJQE.qxd:10-10Pg6exHMNWJQE.qxd 1/1/02 8:35 AM Page 1





### మూలపాడు వేదికగా ఆంధ్ర-కర్ణాటక రంజీ సమరం

# కఠోర సాధనలో ఇరు జట్లు

- విజయవాడకు చేరుకున్న భారత స్టార్ క్రికెటర్ కెఎల్ రాహుల్
- రేపటి నుంచి 14 వరకు రంజీ ట్రోఫీ మ్యాచ్

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులకు ఆసక్తి కలిగించే ఆంధ్ర-కర్ణాటక రంజీ ట్రోఫీ మ్యాచ్‌కు మూలపాడులోని డాక్టర్ గోకరాజు లైలా గంగరాజు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్ వేదిక కానుంది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇరు జట్లు ముమ్మరంగా సన్నద్ధమవుతున్నాయి. భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ విజయవాడకు చేరుకోవడంతో ఈ మ్యాచ్‌పై మరింత ఆసక్తి నెలకొంది. కర్ణాటక జట్టులో కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్ల ఉండటం మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మరోవైపు ఆంధ్ర జట్టు కూడా సొంత గడ్డపై మెరుగైన ప్రదర్శనతో ప్రత్యర్థిని దీటుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. ఇరు జట్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగనుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. మైదానం సిద్ధం చేయడం, పిచ్ నిర్వహణ, ఆటగాళ్లకు అవసరమైన సదుపాయాలు, మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే లక్ష్యంతో ఆంధ్ర, కర్ణాటక జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ సెషన్లలో కఠోర సాధన చేస్తున్నారు. రంజీ ట్రోఫీ వంటి ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీలో కీలకమైన ఈ పోరుకు ఆటగాళ్లు శారీరకంగా, సాంకేతికంగా సిద్ధమవుతున్నారు. బ్యాటింగ్ విభాగంలో క్రీజులో ఎక్కువ సమయం గడపడం, బౌలింగ్‌లో సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు సంధించడం, ఫీల్డింగ్‌లో వేగం, చురుకుదనం పెంపొందించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

**ప్రేక్షకులకు ప్రవేశం లేదు:** కాగా, ఈ మ్యాచ్‌లు చూసేందుకు ప్రేక్షకులకు అనుమతి లేదని



నిర్వాహకులు పేర్కొన్నారు. మ్యాచ్ సజావుగా నిర్వహించడంతో పాటు భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. మైదానం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తూ, అనధికారిక ప్రవేశాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. నిబంధనలను ఉల్లంఘించి మైదానంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రేక్షకులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని సూచిస్తున్నారు. మ్యాచ్ నిర్వహణకు ఏసీఏ, పోలీసు శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది.

### డిసెంబర్‌లో తిరుపతిలో

# డిజిపిల సదస్సు

- ప్రధాని నరేంద్రమోడీ హాజరు

**తిరుపతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతి వేదికగా ఈ యేడాది డిసెంబరులో 61వ అఖిల భారత డిజిపిల సదస్సు జరిగే సూచనలు ఉన్నాయి. ఈ సదస్సుకు ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డిజిపిలు రానున్నారు. పలు కీలక అంశాలపై, అంతర్జాతీయంగా శాంతిభద్రతలు, నేరాలనియంత్రణ, భద్రతపై చర్చజరిగే అవకాశం ఉంది. తిరుపతికి సమీపంలోని ఐసర్ క్యాంపస్‌లో ఈ కీలక సమావేశం జరగనుంది. జాతీయ భద్రత, పోలీసు వ్యవస్థ పనితీరు వంటి కీలక అంశాలపై చర్చించే ఈ సదస్సు ప్రాధాన్యత సంతరించుకోనుంది. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ (ఐసర్) ప్రాంగణం ఎంపికచేశారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కూడా పాల్గొననున్నారు. ఈ సదస్సులో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల డిజిపిలు, కేంద్ర నిఘా సంస్థల అధిపతులు పాల్గొని దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా సుమారు 400 మంది ఐపిఎస్ అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. జాతీయ స్థాయిలో ఇంతటి కీలకమైన సమావేశం ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిలో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.



గట్కా, టాంగ్టా పోటీలను ప్రారంభిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

# గట్కా, టాంగ్టా పోటీలు ప్రారంభం

**జగ్గయ్యపేట, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ కళాశాల ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి గట్కా, టాంగ్టా పోటీలను తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శుక్రవారం ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో మొత్తం 12 జిల్లాల నుండి అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలు ఈపోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ ద్వారా యువ క్రీడాకారుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని, క్రీడలు శారీరక ధృడత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ గంటా వెంకటేశ్వర్లు, అబ్జర్వర్ కె శివ, జోత్స్న, క్రీడా నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు, 12 జిల్లాల నుండి తరలివచ్చిన దాదాపు 500ల మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

# అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీ

- గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి మంత్రి లోకేశ్ భరోసా



శుక్రవారం మంత్రి లోకేశ్‌ను కలిసిన గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి

**అమరావతి, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు పూర్తి అండగా ఉంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన హంపిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించడంలోనూ, వ్యక్తిగత విభాగంలో బోర్డు1పై కాంస్యం గెలవడంలోనూ హంపి పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు.

భవిష్యత్ తరం క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అమరావతిలో ఒక ప్రత్యేక చెస్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను హంపి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అకాడమీ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో చదరంగ క్రీడకు మరింత ప్రోత్సాహం లభించనుంది.

# 'స్త్రీ శక్తి' మహిళా మణులకు వరం

- 100 కోట్ల మహిళల ప్రయాణం పూర్తి కావడం అభినందనీయం
- ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా బస్టాండ్లను తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర రవాణా, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



శుక్రవారం అత్యాధునిక వసతులతో నిర్మించిన ప్రొద్దుటూరు బస్టాండ్‌ను స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి ప్రారంభించిన రాష్ట్ర క్రీడల, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**ప్రొద్దుటూరు(అర్బన్), అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రొద్దుటూరు ప్రజల మన్ననలు పొందేలా ఏపీఎస్ఆర్టీసీ విస్తృత సేవలు అందిస్తామని రాష్ట్ర క్రీడల, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన ప్రొద్దుటూరు బస్టాండ్‌ను స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ దేశంలో రెండో బాంబేగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో ఆధునిక వసతులతో నూతన బస్టాండ్ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని, బస్టాండ్లలో కుర్చీలు, మరుగుదొడ్ల సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు పూర్తి కావడం అభినందనీయమని, ఒక్కో మహిళ నెలకు సగటున రూ.2 వేల వరకు ఆదా చేసుకుంటోందని మంత్రి వివరించారు. రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు చేరాయని, సుమారు 500 సీఎన్‌జీ బస్సులను కొనుగోలు చేశామని తెలిపారు. భవిష్యత్తులో కొనుగోలు చేసే బస్సులన్నీ ఎలక్ట్రికల్ ఏసి బస్సులు ఉంటాయని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ సంస్థను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి విజ్ఞప్తి మేరకు పాత మరియు కొత్త బస్టాండు లను మరింత ఆధునికరిస్తామని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రొద్దుటూరు పట్టణానికి క్రీడలకు సంబంధించి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని ఎమ్మెల్యే చెప్పారని ఆ ఐదు ఎకరాలలో అత్యాధునిక స్టేడియం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ, మంత్రి సహకారంతో ప్రొద్దుటూరులో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు తరఫున అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ శర్మ, ప్రతినిధులు శ్రీరామ వెంకటేష్, గుర్రం రామకృష్ణ రెండు వీల్‌చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్, టిడిపి యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కడప జోనల్ చైర్మన్ నాగరాజు, ఆర్టీసీ జేఎండీ శివప్రసాద్, జోన్4 ఈడీ కిషోర్, డిపిటిఒ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ డిపో మేనేజర్ వెంకటగంగాధర్, ఆర్టీసీ కార్మికులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



# నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వేళాయె!

- రేపు అంకురార్పణ, 12న పెద్దశేషవాహనం

**తిరుమల, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈ యేడాది అధికమాసం రావడంతో రెండవసారి దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు 12నుండి మొదలుకానున్నాయి. ఆదివారం (రేపు) రాత్రి 7 నుండి 9 గంటల వరకు అంకురార్పణం నిర్వహిస్తారు. 12న సోమవారం ఉదయం 9 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం, 13న ఉదయం 8 గంటలకు చిన్నశేష వాహనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం, 14న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనం 15న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనం, 16న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహనం, 17న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు పుష్పక విమానం, రాత్రి 7 గంటలకు గజ వాహనం, 18న అక్టోబరు 18 ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనం, 19న ఉదయం 7 గంటలకు స్వర్ణరథం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, అక్టోబరు 20వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు చక్రస్నానంతో ముగుస్తాయి.

# ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిద్దాం

**డెప్యుటేషన్ ఉద్యోగులతో టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి**



**తిరుమల, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మరో రెండు రోజుల్లో తిరుమలలో మొదలుకానున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను గొప్పగా నిర్వహిద్దామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అధికారుల సమన్వయంతో విజయవంతమయ్యాయని, ఇదే స్ఫూర్తితో నవరాత్రి బ్రహ్మోత్సవాలను గొప్పగా నిర్వహించాలని సూచించారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో విధులు కేటాయించిన టిటిడి ఉద్యోగులకు శుక్రవారం తిరుమల ఆస్థాన మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాలను చక్కటి సమన్వయంతో నిర్వహించామని, ఈ విజయం ఉద్యోగులు అందరిదని చెప్పారు. జెఇఒ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సివిఎస్ఒ మురళీకృష్ణ, మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వెళ్లేందుకు వీలుగా గేట్లను తెరిచి ఉంచడానికి ఉద్యోగులు, శ్రీవారి సేవకులు సహకరించాలన్నారు. జెఇఒ ప్రభల గోపీనాథ్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి వాహనసేవల ముందు విఐపిల కట్టడి చేసేదెవరు!?

- భగవంతుని దగ్గర అంత ప్రాధాన్యత ఎందుకో?
- ప్రేక్షకపాత్రలో టిటిడి అధికారులు

**తిరుమల, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** 'దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే' అనే నానుడికి విరుద్ధంగా తిరుమలలో ఏడాదిలో తొమ్మిదిరోజులు అంగరంగ వైభవంగా జరిగే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వాహనసేవల ముందు విఐపిల తాకిడి ఎక్కువై పోతోంది. గంటలగంటలు ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో నిరీక్షించే సామాన్యభక్తుల కంటే అటు వచ్చి దేవుని ముందు నిలబడే తామే గొప్ప అన్న విధంగా విఐపిల యవ్వారం మితిమీరిపోతోందని అటు శ్రీవారి భక్తులు ఇటు టిటిడి వర్గాలు అసహనం చెందుతున్నాయి. ఏదో గొప్పలు చేస్తున్నట్లు దేవుని ముందు తామే ప్రత్యేకత అన్నట్లు ప్రజాప్రతినిధులేగాక టిటిడి బోర్డు సభ్యులు కూడా ఏకంగా భగవంతుని వాహనం ముందు హంగామా చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇదంతా చాలదన్నట్లు టిటిడి అధికారులు తమ ఉనికిని చాటుకునేలా అంతకుమించి హంగామా చేస్తూ విఐపిలకు ప్రత్యేక మర్యాదలు చేయడంలో మరీ ముందుండటం విశేషం. విఐపిల హడావిడితో వాహనం ముందు టిటిడి అధికారులేగాక వాహన మోతదారులు కూడా అసౌకర్యానికి గురవుతుండటం కనిపిస్తుంది. అయితే ఇదంతా తాము ప్రశ్నిస్తే తమ కుర్చీలు కదలిపోతాయేమోనని అంతర్మథనంతో మిన్నకుండి పోతున్నారు. విఐపిల హంగామాకు తోడు శ్రీవారి వాహనసేవలముందు భద్రతకు టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ, ఎస్‌పిఎఫ్, ఆక్టోపస్ బలగాలు రోప్ పార్టీల పేరుతో మరీ సామాన్యభక్తులు వాహన సేవ ముందుకు రాలేక కట్టడిచేయడం పరిపాటిగా మారింది. ఇలా తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరిగే



మలయప్ప గరుడవాహనసేవ ముందు విఐపిల హంగామా(ఫైల్‌ఫోటో)

తొమ్మిదిరోజులు 14వాహనసేవల ముందు విఐపిల పేరుతో వాహనం ఊరేగే నాలుగుమాఢవీధుల్లోనూ తిరుగుతూ తమవారికి తమ ప్రాబల్యం చాటుకోవడం గమనార్హం. వాహనసేవల ముందు విఐపిల తాకిడిని కట్టడిచేయడంలో మాత్రం టిటిడి అధికారులు సాహసం చేయలేకపోతుండటం భక్తులను విస్మయానికి గురిచేస్తుంది. గత నెలలో జరిగిన తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో వాహనసేవల ముందు ముగ్గురు నలుగురు బోర్డు సభ్యులు తమకు కావలసిన వారిని వారితో బాటు వెంటబెట్టుకుని మాఢవీధుల్లో ఊరేగడం మరీ విచారకరం. పైగా వీరిని అడ్డుకునే వారేగానీ ఎటునుండి వాహనం ముందుకు చేరుకునేందుకు వచ్చినా రెడ్‌కార్పెట్‌లు పరచినట్లు భద్రత సిబ్బంది వంగివంగి దణ్ణం పెట్టి స్వాగతంపలకడం మరీ విశేషం.

టిటిడి అధికారులు మాత్రం వాహనసేవల విశేషాలను ప్రపంచానికి చాటిచెప్పేలా తమ వంతు విశేష కృషి చేస్తున్న మీడియాను కట్టడి చేయడానికి పథకం రచించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

భగవం తుని వాహనసేవలు ఆరంభమైన తొలిరోజు నుండి విఐపిల హడావిడి ఎక్కువగా కనిపిస్తుంది. మరీ గరుడ వాహనసేవ రోజు వాహన మండపం వద్ద మలయప్ప స్వామికి అర్చకులు కర్పూర హారతులిచ్చిన తరువాత అర్ధగంట వరకు విఐపిల సేవలోనే స్వామివాహనాన్ని ఉంచడం మరీ కొసమెరుపు.

వాహనసేవల ముందు ఆలయ అధికారులు, అర్చకులకు కొంత ప్రాధాన్యత ఉంటుంది. స్వామివారి ముందు వీళ్ళూ సేవకులుగా ఉండటం సాధారణమే. అయితే ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు ప్రాబల్యం పెరిగిపోతుండటం మరీ చర్చనీయాంశంగా మారింది. మరీ నవరాత్రి బ్రహ్మోత్సవాల వేళ భగంతుని వాహనసేవల ముందు విఐపిల హంగామా కట్టడి చేస్తారా లేక ఇడే పరంపర కొనసాగిస్తారా అనేది భక్తులు ఆసక్తితో వేచిచూస్తున్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విద్యుత్ కాంతులతో సుందర శోభ



**తిరుమల, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు 12 నుండి 20వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఆధ్యాత్మికంగా తిరుపతి నగరాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించేందుకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో బాటు, రద్దీకి అనుగుణంగా అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం టిటిడి జెఇఒ ప్రభల గోపినాథ్‌తో కలిసి అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. జెఇఒ శరత్ మాట్లాడుతూ వరుస సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. హోల్డింగ్ పాయింట్లు, పార్కింగ్, పారిశుద్ధం, వైద్య సేవలు, మరుగుదొడ్లు, విద్యుత్ అలంకరణలు, అన్నప్రసాదాలు, ఫ్లెక్సీలు, సుందరీకరణ, భద్రత, పబ్లిక్ అడ్రస్ సిస్టం, సూచిక బోర్డులు తదితర 13 అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తిరుపతిలోని టిటిడి ఆలయాలు, భవనాలతోబాటు 17 సర్కిళ్లు, 14 ప్రధాన రోడ్లు, 20 ఆర్చ్‌లు, 8 పార్కింగ్ ప్రాంతాల్లో ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు చేపట్టాలని జెఇఒ సూచించారు. ముఖ్యంగా గరుడ సర్కిల్, నంది సర్కిల్ తదితర కూడళ్లతో బాటు తిరుపతి నుండి అలిపిరికి వెళ్లే రహదారులను విద్యుత్ కాంతులతో అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనం, శ్రీనివాసం, విష్ణునివాసం, మాధవం, లగేజ్ కౌంటర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేయాలన్నారు.

**పార్కింగ్‌లో ఫ్లడ్‌లైట్లు:** ప్రధాన ప్రాంతాల్లో ఎల్ఇడి తోరణాలు, ఆకర్షణీయమైన డిజైన్లు, ఎల్ఇడి బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో తగిన వెలుతురు కోసం ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడంతో బాటు భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టం, సూచిక బోర్డులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రధాన కూడళ్లలో బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల పాటు ఎల్ఈడీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు, పార్కింగ్ ప్రాంతాల్లో తగిన సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జెఇఒ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ మనోహరం, విఎస్ఒ గిరిధర్, అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ సెల్వం, అదనపు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సునీల్ కుమార్, డిఇ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

# దసరా నవరాత్రుల సందర్భంగా వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు

**విజయవాడ కార్పొరేషన్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఈ నెల 11 నుండి దసరా నవరాత్రులు విజయవాడలో జరుగుతన్న సందర్భంగా ఉత్సవాల్లో కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పార్కింగ్ నేవిగేషన్, 40 పార్కింగ్ స్థలాలు, భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు తెలిపారు.

**ప్రాంతాల వారీగా పార్కింగ్ స్థలాలు:** రాంప్, గణేష్ నిమజ్జన ప్రదేశం, కాళేశ్వరరావు రైతు బజార్, రైల్వే వెస్ట్ బుకింగ్, తారాపేట, గాంధీ మున్సిపల్ హైస్కూలు (విఎంసి పెయిడ్ పార్కింగ్), గద్ద బొమ్మ సమీపం, హెడ్ వాటర్ వర్క్స్ (లోటస్ అపార్ట్‌మెంట్ వెనుక), లోటస్ ఎదురుగా ప్రైవేట్ నిర్మాణ స్థలం, బెర్మ్ పార్క్, భవానీ ఐలండ్, ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సరస్, బబ్బూరి గ్రౌండ్స్, అన్నా కళ్యాణమండపం, భవానీపురంలోని స్వర్ణ 40 లార్టీ స్టాండ్ ప్రాంతం, షాదీఖానా, సోమా గ్రౌండ్, ఆర్టీసి వర్క్‌షాపు రోడ్, ఆర్టీసి హాస్పిటల్ స్థలం, వేగా ప్రైవేటు స్థలం, విజయవాడ ఉత్సవ్, వెంకటేశ్వర ఫౌండ్రి ప్రాంతం, టిటిడి గ్రౌండ్, పడవల రేవు నుండి ఆంజనేయ స్వామి ఆలయం వరకు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, కాలువ రోడ్, రైతు బజార్ కాలువ రోడ్, ఎఫ్-3 ఫుడ్ కోర్టు వద్ద, (ఆర్టీసి ఇన్ గేట్ ఎదురుగా), ఎఫ్‌సిఐ గోడౌన్, మధురానగర్ నుండి ఆంజనేయ స్వామి ఆలయం వరకు, మధురానగర్ నుండి ఫుడ్ జంక్షన్ వరకు, ఫుడ్ జంక్షన్ నుండి శారదా కళాశాల వరకు, శారదా కళాశాల నుండి సీతన్న గేట్ జంక్షన్ వరకు, రైల్వే క్వార్టర్స్ రోడ్(సత్యన్నారాయణపురం), జింఖానా గ్రౌండ్స్, సంగీత కళాశాల, డిస్నీలాండ్ పార్కింగ్, ఎక్సెల్ రోడ్, కనకదుర్గ ఫ్లై ఓవర్ ప్రదేశ్, (సిఎన్‌జి బంక్ వద్ద), బొడ్డు రాయి సెంటర్, కనకదుర్గ ఫ్లై ఓవర్ ప్రదేశం (స్వాతి సెంటర్ వద్ద), పున్నమిఘాట్, సిఎం కన్వెన్షన్‌ల వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

**భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు:**

రద్దీ ప్రాంతాల్లోకి భారీ వాహనాలు రాకుండా, లారీలు, ఇతర భారీ వాహనాల డ్రైవర్లు కింద మార్గాల్లో వెళ్ళాలని తెలిపారు. 1. హైదరాబాద్ నుండి ఏలూరు వెళ్ళే వాహనాలు హైదరాబాద్, నల్లకుంట, వెస్ట్ బైపాస్, వెదురుపావులూరు టోల్ ప్లాజా, చిన్న అవుటపల్లి మీదుగా చేరుకోవాలి. 2. హైదరాబాద్ నుండి చెన్నై వెళ్ళే వాహనాలు ఇబ్రహీంపట్నం, నల్లకుంట, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం టోల్ ప్లాజా, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మీదుగా చెన్నై చేరుకోవాలి. 3. ఏలూరు నుండి హైదరాబాద్‌కు వెళ్ళే వాహనాలు ఏలూరు, చిన్న అవుటపల్లి, వెస్ట్ బైపాస్, వెదురుపావులూరు టోల్ ప్లాజా,నల్లకుంట, ఇబ్రహీంపట్నం మీదుగా హైదరాబాద్ చేరుకోవాలి. 4. ఏలూరు నుండి చెన్నై వెళ్ళే వాహనాలు ఏలూరు, చిన అవుటపల్లి, వెస్ట్ బూపపాస్, వెదురు పావులూరు టోల్ ప్లాజా, నల్లకుంట,వెంకటపాలెం టోల్ ప్లాజా, కాజ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మీదుగా చెన్నై చేరుకోవాలి. 5. చెన్నై నుండి హైదరాబాద్‌కు వెళ్ళే వాహనాలు నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, కాజ, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం టోల్ ప్లాజా,నల్లకుంట, ఇబ్రహీంపట్నం మీదుగా హైదరాబాద్‌కు చేరుకోవాలి. 6. చెన్నై నుండి ఏలూరుకు వెళ్ళే వాహనాలు నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, కాజ, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం టోల్ ప్లాజా, నల్లకుంట, వెదురుపావులూరు టోల్ ప్లాజా, చిన్న అవుటపల్లి, ఏలూరుకు చేరుకోవాలి. 7. చెన్నై నుండి మచిలీపట్నం వెళ్ళే వాహనాలు చెన్నై, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, కాజ, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం టోల్ ప్లాజా, నల్లకుంట, వెదురుపావులూరు టోల్ ప్లాజా, చిన్న అవుటపల్లి, కేసరపల్లి, ఉప్పులూరు, కంకిపాడు, వుయ్యూరు మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. 8. మచిలీపట్నం నుండి ఒంగోలుకు వెళ్ళే వాహనాలు తాడిగడప 100 అడుగుల రోడ్డు, ఎనికేపాడు, యూటర్న్, గన్నవరం, చిన్న అవుటపల్లి, వెస్ట్ బైపాస్, నల్లకుంట, వెంకటపాలెం టోల్‌ప్లాజా, కాజ, గుంటూరు మీదుగా ఒంగోలుకు చేరుకున్నారు. 9.మచిలీపట్నం నుండి హైదరాబాద్‌కు వెళ్ళే బస్సులు తాడిగడప 100 అడుగుల రోడ్డు, ఎనికేపాడు, యూటర్న్, చిన్న అవుటపల్లి, వెస్ట్ బైపాస్, నల్లకుంట, ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్ళాలని పేర్కొన్నారు. పోలీసుల సూచనలు పాటించి, కేటాయించిన చోటే వాహనాలు నిలపాలని, రోడ్లపై పార్కింగ్ చేయద్దని విజ్ఞప్తి చేశారు.

10-10pg10exWT.qxd:10-10pg10exWT.qxd 1/1/02 8:40 AM Page 1



# ఐపిఎల్ 2027 ముందు.. పంజాబ్ కింగ్స్‌కు షాక్

## ఇద్దరు కోచ్‌లు ఔట్



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2027 సీజన్‌కు ముందు కీలక సమయంలో పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సహాయక బృందంలోని ఇద్దరు కీలక సభ్యులు తమ పదవుల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ, వేలం సన్నాహాలు సమీపిస్తున్న నేపథ్యంలో కోచింగ్ బృందాన్ని పటిష్ఠం చేసుకోవడం పాంటింగ్‌కు పెద్ద సమస్యగా మారింది. ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ పంజాబ్ ఫ్రాంచైజీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియాకు చెందిన హోప్స్, హాడిన్ తమ నిర్ణయాలను ఇటీవలే పంజాబ్ కింగ్స్ యాజమాన్యానికి తెలియజేసినట్లు తెలుస్తోంది. వీరిద్దరికీ బిగ్ బాష్ లీగ్ (బిబిఎల్)లో అవకాశం వచ్చినట్లు సమాచారం. జేమ్స్ పంజాబ్ కింగ్స్‌కు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా సేవలందించారు. అంతకుముందు రికీ పాంటింగ్‌తో కలిసి ఢిల్లీ క్యాపిటల్స్‌లోనూ పనిచేశాడు. పాంటింగ్‌తో ఉన్న అనుబంధం కారణంగా పంజాబ్ జట్టులో చేరాడు. ఇప్పుడు హోప్స్ నిష్క్రమణతో బౌలింగ్ విభాగానికి కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. మరోవైపు బ్రాడ్ హాడిన్ ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. పాంటింగ్ పంజాబ్ కింగ్స్‌లో చేరకముందే హాడిన్ జట్టు సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్నాడు. గతంలో ట్రెవర్ బేలిస్ కోచ్ ఉన్న సమయంలో ఆయనను నియమించారు. హోప్స్, హాడిన్ స్థానాలకు సరైన ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసే బాధ్యత పాంటింగ్స్ పైనే ఉండనుంది. కోచింగ్ సిబ్బందిలో మార్పులపై పాంటింగ్, ఫ్రాంచైజీ యాజమాన్యం చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. డిసెంబర్లో జరగనున్న ఐపిఎల్ 2027 వేలానికి ముందే కొత్త కోచ్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని పంజాబ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పంజాబ్ కింగ్స్‌లో మరో కోచ్ స్థానం కూడా ఖాళీగా ఉంది. స్పిన్ బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన సాయిరాజ్ బహుతులే ఐపీఎల్ 2026 తర్వాత ఆ జట్టును వీడి భారత జట్టు సహాయక సిబ్బందిలో చేరారు. అంతకుముందు పంజాబ్ కింగ్స్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన సునీల్ జోషి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్పిన్ బౌలింగ్ విభాగానికి మారడంతో ఆయన స్థానంలో బహుతులేను నియమించారు.

దీంతో ఐపిఎల్ 2027 సీజన్‌కు ముందు పంజాబ్ కనీసం ముగ్గురు కోచ్‌లను కొత్తగా నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ 14 మ్యాచ్లో ఏడు విజయాలు, ఆరు ఓటములతో 15 పాయింట్లు సాధించింది. +0.309 నెట్ రన్రేట్తో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది.




## సిరియాపై 2-0 తేడాతో

# భారత్ విజయం

**సెలయాంగ్:** సిరియాపై 2-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించడం ద్వారా, భారత అండర్17 మహిళల జట్టు తమ ఏఎఫ్‌సి అండర్17 మహిళల ఆసియా కప్ చైనా 2027 క్వాలిఫయర్స్ ప్రచారంలో మరో కీలక ముందడుగు వేసింది. తొలి మ్యాచ్‌లో ఇరాక్‌పై భారత్ సాధించిన 140 రికార్డు విజయంలో ఐదు గోల్స్ చేసిన అనుష్క కుమారి, విరామానికి ముందు, తర్వాత చెరో గోల్ చేసి, తన క్వాలిఫయర్స్ గోల్స్ సంఖ్యను ఏడుకు చేర్చింది. భారత జట్టు కేవలం ఆరు నిమిషాల్లోనే ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనుష్క చివరకు స్కోరును 2-0కి చేర్చింది. ఉరుములతో కూడిన వర్షం కారణంగా 58వ నిమిషంలో ఆటను నిలిపివేశారు. దాదాపు అరగంట ఆలస్యం తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా, సెలయాంగ్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఆట చివరి దశల్లో కూడా వర్షంకొనసాగింది. భారత్ చివరి వరకు ఒత్తిడి కొనసాగించినప్పటికీ, సిరియా సంఖ్యాబలంతో రక్షణాత్మకంగా ఆడి స్కోరును తక్కువగా ఉంచగలిగింది. తండమోని కుడివైపున ప్రత్యామ్నాయ క్రీడాకారిణి ప్రీతికబర్మన్‌కు బంతిని అందించినప్పుడు, అనుష్క తన హ్యాట్రిక్‌ను పూర్తి చేయడానికి ఒక సువర్ణావకాశం లభించింది. దీంతో భారత్ జట్టు ఈ క్వాలిఫైయింగ్ ప్రచారంలో తమ వరుసగా రెండవ విజయాన్ని, క్లీన్ షీట్‌ను నమోదు చేశాయి.

## హాకీ టోర్నీ నుంచి..

# పాకిస్థాన్ ఔట్.. బంగ్లాదేశ్ ఇన్..

### తటస్థ వేదిక అభ్యర్థనను తోసిపుచ్చిన హాకీ ఇండియా



**న్యూఢిల్లీ:** భారత్ ఆతిథ్యమివ్వనున్న 2026 ఆసియన్ హాకీ ఛాంపియన్స్ ట్రోఫీలో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా కారణాలను చూపుతూ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ నుంచి పాకిస్థాన్ హాకీ జట్టు వైదొలగింది. దీంతో, రిజర్వ్ జట్టుగా ఉన్న బంగ్లాదేశ్‌కు ఆసియన్ హాకీ ఫెడరేషన్ (ఏహెచ్‌ఎఫ్) టోర్నీలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఈ టోర్నమెంట్‌ను అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో నిర్వహించనున్నారు. అయితే, తమ ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్‌ఎఫ్), తమ మ్యాచ్‌లను ఏదైనా తటస్థ వేదికకు మార్చాలని ఏహెచ్‌ఎఫ్‌ను కోరింది. ఈ అభ్యర్థనను హాకీ ఇండియా నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే టోర్నీ జరుగుతుందని స్పష్టం చేయడంతో పాక్ ఈ పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించింది. పాకిస్థాన్ వైదొలగడంతో ఏహెచ్‌ఎఫ్ ఆహ్వానం మేరకు బంగ్లాదేశ్ ఈ టోర్నీలో పాల్గొనేందుకు అంగీకరించింది. దీంతో ఆతిథ్య భారత్‌తో పాటు జపాన్, చైనా, మలేషియా, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ ఇప్పటివరకు నాలుగుసార్లు ఈ టైటిల్‌ను గెలుచుకుంది. 2018లో భారత్, పాకిస్థాన్ జాయింట్ విన్నర్స్‌గా నిలవడం గమనార్హం. ఇటీవలి కాలంలో భారత్‌లో జరిగే ఆసియా కప్, జూనియర్ వరల్డ్ కప్ వంటి టోర్నీలకు కూడా పాక్ జట్టు దూరంగా ఉంది.

## మహిళల ఫుట్‌బాల్..

# యువ భారత్ చిత్తు

### రష్యా చేతిలో 0-4 తేడాతో ఓటమి



**కోల్‌కతా:** రెండు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లలో మొదటిదానిలో, యువ భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు రష్యా చేతిలో 0-4 తేడాతో ఓటమి పాలైంది. ఆతిథ్య జట్టుపై నిరంతర ఒత్తిడి తెచ్చిన తర్వాత, సందర్శక జట్టు నాలుగు గోల్స్‌ను సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 69వ స్థానంలో ఉన్న భారత్, 27వ ర్యాంకులో ఉన్న రష్యాను తొలి అర్ధభాగంలో చాలాసేపు కట్టడి చేసింది. అయితే 40వ నిమిషంలో ఇయానా షెయినా తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని అందించింది. ప్రత్యామ్నాయ క్రీడాకారిణి కిరా పెటుఖోవా 60, 65వ నిమిషాల్లో చెరో గోల్ చేయగా, 81వ నిమిషంలో ఇయానా స్విస్తునోవా నాలుగో గోల్‌ను జోడించింది. ఈ మ్యాచ్ కోల్‌కతాలో జరిగిన మొట్టమొదటి మహిళల అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్ కావడం విశేషం. రష్యా వ్యూహానికి తొలి అర్ధభాగంలో భారత్ పటిష్టమైన రక్షణ వ్యూహాన్ని కొనసాగించింది. అతిథి జట్టును నిలువరించడానికి మోనాలిషా అనేక కీలకమైన సేవ్స్ చేసింది. భారత్ కూడా తమ వంతు అవకాశాలను సృష్టించుకుంది. ఆట మొదలైన అరగంట తర్వాత మాలవిక గోల్ చేసే యత్నం చేసినా, రష్యన్ గోల్ కీపర్ నటాలియా సిలినా దాన్ని అడ్డుకుంది. లిండా కోమ్ సెర్టోకు కూడా అవకాశం లభించినా గోల్ చేయలేకపోయింది. చివరకు షీనా రష్యాకు ఆధిక్యం అందించింది. 60వ నిమిషంలో నదేజ్డా స్మిర్నోవా కొట్టిన షాట్‌ను మోనాలిషా అడ్డుకున్న తర్వాత, పెటుఖోవా మళ్ళీ గోల్ చేసింది. 66వ నిమిషంలో చెత్రి జట్టు శుభాంగి సింగ్, ప్రియదర్శిని సెల్లాదురై, రేణులను బరిలోకి దించుతూ మార్పు చేసినా 81వ నిమిషంలో స్విస్తునోవా స్కోరింగ్‌ను పూర్తి చేయడంతో రష్యా గెలుపుసాధించింది.

## షాంఘై మాస్టర్స్.. షెల్టన్ ముందంజ




**చైనా:** బెన్ షెల్టన్ శుక్రవారం డేనియల్ ఆల్ట్‌మాయర్‌పై స్ట్రెయిట్ సెట్స్‌లో విజయం సాధించి, షాంఘై మాస్టర్స్‌లో మూడవ రౌండ్‌లోకి ప్రవేశించి తన 24వ పుట్టినరోజును జరుపుకున్నాడు. డేవిస్ కప్‌లో యుఎస్‌ఎ తరపున తన రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోయి, ఆ తర్వాత లేవర్ కప్ నుండి వైదొలిగిన షెల్టన్, 6-3, 7-6 (6) తేడాతో గెలిచాడు. అంతకు ముందు, అలెక్స్ మోల్కాన్ అనే ప్రత్యర్థి పేరు వెల్లడించని అనారోగ్యంతో వైదొలగడంతో అలెక్స్ డి మినార్ మూడవ రౌండ్‌లోకి ప్రవేశించాడు. క్వాలిఫయర్ రే సకామోటో 23వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్‌ను 6-4, 6-4 తేడాతో ఓడించాడు. ఆ తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో షెల్టన్‌ను ఓడించిన టాప్ సీడెడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, చైనా వైల్డ్ కార్డ్ ఎంట్రీ వు యిబింగ్‌ను 6-4, 7-6 (4) తేడాతో ఓడించగా, నోవాక్ జొకోవిచ్ హుబెర్ట్ హుర్కాజ్‌తో తలపడనున్నాడు.

# భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### ఐటి షేర్లలో కొనుగోళ్ల జోరు




**ముంబయి, అక్టోబరు 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. వరుసగా రెండు సెషన్ల నష్టాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరల తగ్గుదల ఇన్వెస్టర్ల కొనుగోళ్లకు ఊతమిచ్చాయి. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై సైనిక దాడి చేపట్టబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయన్న ఆందోళనలను కొంత తగ్గించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరగడం కూడా మార్కెట్లకు మద్దతునిచ్చింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 879.09 పాయింట్లు లాభపడి 72,472.33 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 288.65 పాయింట్లు పెరిగి 22,520.45 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ లాభాల్లో ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కీలక పాత్ర పోషించాయి. ఐటీసీ షేరు 4.31 శాతం, ఇన్ఫోసిస్ 2.65 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.17 శాతం చొప్పున పెరిగాయి. టీసీఎస్ షేరు 3.85 శాతం లాభపడింది. హెక్సావేర్ టెక్నాలజీస్ షేరు 5.98 శాతం ఎగసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 1.37 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.49 శాతం లాభపడింది. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆధిపత్యం ఎన్ఎస్ఈలో మొత్తం 2,182 షేర్లు లాభాల్లో ముగియగా, 1,391 షేర్లు నష్టపోయాయి. మరో 111 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ డిసెంబర్ 2026 కాంట్రాక్టు ధర బ్యారెల్‌కు 1.34 డాలర్లు తగ్గి 102.94 డాలర్లకు చేరింది. అమెరికా పదేళ్ల ప్రభుత్వ బాండ్ల రాబడి 0.40 శాతం పెరిగి 5.250 స్థాయికి చేరింది. భారత్ పదేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి గత సెషన్‌లోని 7.289 శాతం నుంచి 7.302 శాతానికి పెరిగింది. విదేశీ మారక మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 96.8800 వద్ద ముగిసినరూపాయి, శుక్రవారం 96.7200 స్థాయిలో కదలాడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో డిసెంబర్ 4, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.01 శాతం పెరిగి రూ.1,51,115కు చేరింది. పీ ఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ రెండో త్రైమాసికంలో ఆదాయం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 22.4 శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించడంతో షేరు 2.01 శాతం లాభపడింది. పేస్ డిజిటెక్: బీఎస్ఈఎస్ రాజధాని పవర్ (బీఆర్పీఎల్) నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) అందుకోవడంతో షేరు 2.87 శాతం పెరిగింది. ఎస్ఎంఎల్ మహీంద్రా: షేరు 0.52 శాతం తగ్గింది.

# రూ.10.3 లక్షల కోట్ల వరకు కంపెనీ విలువ

### 21న జియో ఐపిఓ బిడ్డింగ్ ప్రారంభం




**ముంబై, అక్టోబరు 9:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీకి చెందిన జియో ప్లాట్‌ఫామ్స్ తన తొలి ఐపీఓలో ఒక్కో షేరు ధరను రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య నిర్ణయించవచ్చన్న అంచనాలు పెరిగాయి. ఈ ఐపీఓ ద్వారా జియో ప్లాట్‌ఫామ్స్ మార్కెట్ విలువను గరిష్ఠంగా రూ.10.3 లక్షల కోట్లకు (సుమారు 107 బిలియన్ డాలర్లు) చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత ధరల శ్రేణిలో గరిష్ఠ ధర వద్ద షేర్లను విక్రయిస్తే సుమారు రూ.30,200 కోట్ల నిధులు సమీకరించే అవకాశం ఉందని బిజినెస్ నిపుణుల లెక్కలు సూచిస్తున్నాయి. ఇదే జరిగితే భారతదేశంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఐపీఓగా జియో నిలవనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు ఈనెల 21న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి, 23న ముగించాలని యోచిస్తున్నట్లు సమాచారం. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం అక్టోబర్ 19న బుక్ ప్రారంభం కావచ్చని, అక్టోబర్ 28న షేర్లు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. హ్యుందాయ్ ఐపీఓ రికార్డు అధిగమించే అవకాశం

ప్రస్తుతం భారతదేశంలో అతిపెద్ద ఐపీఓగా హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ షేర్ల విక్రయం ఉంది. 2024 అక్టోబర్‌లో ఆ కంపెనీ సుమారు రూ.27,800 కోట్ల నిధులను సమీకరించింది. జియో ప్రతిపాదిత ఐపీఓ ఈ రికార్డును అధిగమించే అవకాశం ఉంది. జియో ప్లాట్‌ఫామ్స్ జూన్‌లో సమర్పించిన ప్రాథమిక ప్రాస్పెక్టస్‌లో గరిష్ఠంగా 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేసే ప్రతిపాదన ఉంది. ఇవి ఐపీఓ అనంతరం కంపెనీ మొత్తం ఈక్విటీ మూలధనంలో సుమారు 2.93 శాతానికి సమానం. గతంలో కంపెనీ విలువను సుమారు రూ.11 లక్షల కోట్లుగా నిర్ణయించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు కొన్ని అంచనాల్లో కంపెనీ విలువ 130 బిలియన్ డాలర్ల నుంచి 170 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని భావించారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ జియో ప్లాట్‌ఫామ్స్ విలువను 115 బిలియన్ డాలర్ల నుంచి 118 బిలియన్ డాలర్ల మధ్య అంచనా వేసింది. దోలత్ క్యాపిటల్ మాత్రం కంపెనీ విలువను సుమారు 110 బిలియన్ డాలర్లుగా పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ప్రక్రియలో భాగంగా మొత్తం 19 బ్యాంకులను నియమించింది. వీటిలో కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ, బ్యాంక్ ఆఫ్ అమెరికా, యాక్సిస్ క్యాపిటల్, బీఎన్‌పీ పారిబాస్, సిటీగ్రూప్ తదితర ప్రముఖ ఆర్థిక సంస్థలు ఉన్నాయి.

# జీతాలు,బోనస్‌లే కాదు..డిస్కౌంట్‌కే ఉద్యోగులకు షేర్లు

### ఎన్విడియా సక్సెస్ స్టోరీ చెప్పిన హెచ్‌ఆర్‌డి అధినేత




**న్యూఢిల్లీ,అక్టోబరు 9:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న సంస్థల్లో ఎన్విడియా ఒకటి. మార్కెట్ విలువ పరంగా కూడా ప్రపంచంలో ఇదే అతిపెద్ద సంస్థ. ప్రస్తుత మార్కెట్ విలువ 5.70 ట్రిలియన్ డాలర్లకుపైనే ఉండగా భారత కరెన్సీలో చూస్తే ఇది రూ. 550 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. ఈ కంపెనీ షేరు ధర భారీగా పెరగడంతో ఉద్యోగులకు కూడా మంచి ప్రయోజనాలు దక్కుతున్నాయి. అయితే ఇక్కడ ఉద్యోగులను తమ సంస్థలో ఎక్కువ కాలం కొనసాగించడానికి కేవలం జీతాలు, బోనస్‌పైనే ఆధారపడటం లేదని ఎన్విడియా చెబుతోంది. కంపెనీ హెచ్‌ఆర్ డైరెక్టర్ ఫిబే పున్సలాన్ ఫార్చ్యూన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉద్యోగులకు తాము అందించే కొన్ని రకాల ప్రయోజనాలను వివరించారు. ఎన్విడియాలో పని చేసే ఉద్యోగులు తమ జీతం నుంచి డబ్బును ఉపయోగించి కంపెనీ షేర్లను మార్కెట్ ధర కంటే ఏకంగా 15 శాతం డిస్కౌంట్‌తో కొనుగోలు చేయొచ్చు. దీంతో ఈ స్కీమ్ ద్వారా షేర్లు కొనుగోలు చేసిన ఉద్యోగులకు మంచి ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

కొంత మంది ఉద్యోగులు ఈ షేర్ల విలువ పెరగడంతో లక్షాధికారులు, కోటీశ్వరులుగా మారినట్లు నివేదిక పేర్కొంది. అయితే ఉద్యోగులకు లభించే ప్రయోజనాలకు తగ్గట్లుగానే పని ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుందని హెచ్‌ఆర్ డైరెక్టర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ఇక ఉద్యోగులకు ఎన్విడియా అందించే మరో ప్రయోజనం ఫ్రీ డేస్. ప్రతి 3 నెలలకు 2 రోజులు కంపెనీ తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తుంది. అంటే ఏటా 8 అదనపు సెలవులు లభిస్తాయి. కొవిడ్19 సమయంలో ఉద్యోగుల నుంచి నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ రోజుల్లో ఉద్యోగులు తమ పని నుంచి పూర్తిగా రెస్ట్ తీసుకోవచ్చు. తిరిగి విధుల్లో చేరినప్పుడు పెండింగ్ వర్క్ అలానే ఉండిపోకుండా కంపెనీ ఈ విధానాన్ని అమలు చేస్తోంది.

ఇంకా ఎన్విడియాలో వ్యవస్థ కూడా ఇతర పెద్ద కంపెనీలతో పోలిస్తే కొంత సరళంగా ఉంటుందని హెచ్‌ఆర్ డైరెక్టర్ స్పష్టం చేశారు. కంపెనీలో ఉద్యోగుల కొనసాగింపు రేటు కూడా మంచి స్థాయిలో ఉందని చెబుతున్నారు. ఇక ఫార్చ్యూన్ రిపోర్ట్ ప్రకారం ఎన్విడియా ఉద్యోగుల వార్షిక టర్నోవర్ రేటు 3.7 శాతం మాత్రమే. టెక్నాలజీ ఇండస్ట్రీ సగటు 21.9 శాతంగా ఉంది.

## గోల్డ్ ఇటిఎఫ్ ఆస్తుల విలువ రూ.1.91 లక్షల కోట్లు



**ముంబయి, అక్టోబరు 9:** భారత్‌లో బంగారం పెట్టుబడులకు భారీగా ఆదరణ పెరుగుతోంది. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో పెట్టుబడులు ఏడాది వ్యవధిలో ఏకంగా 164 శాతం పెరిగాయి. 2026 ఆగస్టు నాటికి ఈ ఫండ్లలోని ఆస్తుల విలువ రూ.1.91 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఈ మొత్తం సుమారు రూ.72,500 కోట్లుగా ఉందని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. ఇన్వెస్టర్లు ఇపుడు బంగారాన్ని పెట్టుబడుల డైవర్సిఫికేషన్‌లో భాగంగా కూడా ఉపయోగిస్తున్నారు. వెండిఈటీఎఫ్‌లలోనూ ఆగస్టు నాటికి రూ.85 వేల కోట్ల నుంచి రూ.86 వేల కోట్ల వరకు పెట్టుబడులు ఉన్నాయి. బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై పెట్టుబడులు పెరుగుతుండటంతో పాటు, పారిశ్రామిక లోహాల మార్కెట్ కూడా విస్తరిస్తోంది. రాగి, అల్యూమినియం, జింక్ వంటి లోహాలకు నిర్మాణ రంగం, తయారీ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి డిమాండ్‌ఉంటుంది. విద్యుత్ వినియోగం పెరగడం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌లు, సాంకేతిక మౌలిక సదుపాయాల విస్తరణతో వీటికి మరింత డిమాండ్ ఏర్పడుతోంది. మరోవైపు భారత్‌లో మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్లలో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. 2026 ఆగస్టు నాటికి వీటి ఆస్తుల విలువ రూ.2.07 లక్షల కోట్లను దాటింది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 57 శాతం వృద్ధి నమోదైంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రతినిధి షీలా కులకర్ణి మాట్లాడుతూ, బంగారం డిమాండ్ స్వరూపం మారుతోందని, ఈఏడాది తొలి రెండు నెలల్లోనే బంగారం ధరలు 11 సార్లు కొత్త గరిష్ఠాలను నమోదు చేయడం కూడా మార్కెట్‌లో దాని ప్రాధాన్యాన్ని చూపుతోందని అన్నారు.

## రుణాలపై మరింత పెరిగే వడ్డీభారం: గోల్డ్‌మాన్‌శాక్స్ అంచనా




**ముంబయి, అక్టోబరు 9:** రుణాలపై వడ్డీ భారం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ 2027 జూన్ నాటికి మరో మూడు విడతల్లో వడ్డీ రేట్లు పెంచవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. మొత్తం 0.75 శాతం మేర పెంపు ఉండొచ్చని సంస్థ భారత విభాగం ముఖ్య ఆర్థికవేత్త శంతను సేన్‌గుప్తా వెల్లడించారు. డిసెంబరు, ఫిబ్రవరి, ఏప్రిల్ లేదా జూన్‌లో ఈ పెంపులు ఉండవచ్చని పేర్కొన్నారు. వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి మాత్రం దాదాపు 7శాతంగా కొనసాగవచ్చని సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ స్థాయి వృద్ధిని సాధించడం విశేషమని పేర్కొన్నారు. 2027లో ఎల్‌నినో ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థకు సవాలుగా మారవచ్చని ఆయన హెచ్చరించారు. దీనివల్ల ఆర్థిక వృద్ధికి విఘాతం కలగడంతో పాటు ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుత నిల్వలు సమీప భవిష్యత్తులో ధరల పెరుగుదలను కొంతవరకు అదుపులో ఉంచగలవని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గితే రబీ పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడవచ్చని సేన్‌గుప్తా తెలిపారు. 2027నాటికి ఆహార నిల్వలు తగ్గితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ముడిచమురు ధరలు కూడా కీలకంగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## యుఎస్ ఆంక్షలున్నా జోరుతగ్గని ఐటీ షేర్లు

**ముంబయి, అక్టోబరు 9:** అమెరికా గ్రీన్‌కార్డ్ ప్రోగ్రామ్‌పై ఆంక్షలు విధించినా భారత ఐటీ కంపెనీల షేర్లు మాత్రం లాభాల్లో పయనిస్తున్నాయి. నేటి ట్రేడింగ్ ప్రారంభంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో సహా పలు ఐటీ కంపెనీల షేర్లు భారీగా పెరిగాయి. గత సెషన్‌లో మార్కెట్లు తీవ్రంగా పడిపోవడంతో తక్కువ ధరలకు షేర్లు కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం, టీసీఎస్ ఆర్థిక ఫలితాలు, ఏఐ వ్యాపారంలో వృద్ధి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ట్రేడింగ్‌లో నిఫ్టీ ఐటీ సూచీ 3.31 శాతం పెరిగి 28,654.70 పాయింట్లకు చేరింది. టీసీఎస్ షేరు 4.62 శాతం, ఇన్ఫోసిస్ 3.12 శాతం, విప్రో 3.31 శాతం, టెక్ మహీంద్రా 2.19 శాతం చొప్పున పెరిగాయి. ఎల్‌టీఎం, పర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎంఫాసిస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అమెరికా ప్రభుత్వం టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ సహా పలు సంస్థలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (పెర్మ్) స్కీంనుంచి తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ఆంక్షల వల్ల తమ అమెరికా ఉద్యోగుల నియామక వ్యూహం, కస్టమర్లకు అందించే సేవలపై ప్రభావం ఉండబోదని టీసీఎస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది.

గత రెండేళ్లలో తమ పెర్మ్ దరఖాస్తులు సింగిల్ డిజిట్‌లోనే ఉన్నాయని వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో అమెరికాలో మరో 15 వేల మందిని నియమించుకోవాలన్న ప్రణాళిక కూడా కొనసాగుతుందని పేర్కొంది. ఈ వివరణలు ఇన్వెస్టర్ల ఆందోళనలను కొంత తగ్గించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.